RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 19 అక్టోబర్ 2026 సోమవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:122



ప్రజాబలం

19 అక్టోబర్ 2026 సోమవారం

# ఆనాటి ధన్‌ఖడ్ వెనుక అసలు కథ..

భారతదేశ పురోభివృద్ధిని అడ్డుకోవడంతోపాటు దేశంలో రాజకీయ నాయకత్వాన్ని బలహీనపరచడానికి విదేశీ శక్తులు... ముఖ్యంగా అమెరికాలోని కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయా? ప్రముఖ న్యాయవాది, మాజీ సొలిసిటర్ జనరల్ హరీశ్ సాల్వే కూడా తాజాగా ఇలాంటి ఆరోపణలే చేశారు. సాల్వే వంటి వారి వ్యాఖ్యలను, ఆరోపణలను తేలికగా తీసి పారేయకూడదు. మన దేశ అంతర్గత వ్యవహారాలలో విదేశీ శక్తుల జోక్యంపై ఆరోపణలు వినిపించడం కొత్త కాదు. దివంగత ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు దేశంలో ఎలాంటి అలజడి ఏర్పడినా, వాటి వెనుక విదేశీ శక్తుల పాత్ర ఉందని ఆరోపించేవారు. భారతదేశం బలమైన శక్తిగా ఎదగడాన్ని అమెరికా వంటి దేశాలు సహజంగానే జీర్ణించుకోలేవు. తమ దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతూ, తమ పెద్దన్న పాత్రను భారతదేశం అంగీకరించాలని అమెరికా కోరుకుంటుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఈ నేపథ్యంలో హరీశ్ సాల్వే వంటి వారి ఆరోపణలను కొట్టిపారేయలేము. 'సర్'కు వ్యతిరేకంగా ఓట్ చోరీ పేరిట కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో ఇటువంటి ఆరోపణలకు ప్రాధాన్యం సంతరించుకుంటోంది. కొంతకాలం క్రితం శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో జెన్--జీ ఉద్యమాలు రావడం, ప్రభుత్వాలు పతనం కావడం తెలిసిందే. జనాభా పరంగా చైనాతో పోటీపడుతూ ఆర్థికంగా ఎదుగుతున్న భారతదేశం ఇప్పుడు అంతర్జాతీయ ఉత్పత్తులకు అతి పెద్ద మార్కెట్‌గా అవతరించింది. ఈ కారణంగా భారతదేశంలో తమకు అనుకూల ప్రభుత్వాలు ఉండాలని, ప్రభుత్వాల విధానాలు తమ వ్యాపార, రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలని విదేశీ శక్తులు కోరుకోవడం సహజం.

ధన్‌ఖడ్ రాజీనామా వెనుక...

హరీశ్ సాల్వే ఆరోపణల్లో ఎంతవరకు వాస్తవం ఉందో తెలియాలంటే ఒక ఏడాది వెనక్కు వెళ్లాలి. అప్పుడు భారత ఉప రాష్ట్రపతిగా ఉండిన జగదీప్ ధన్‌ఖడ్ ఉన్నపళంగా రాజీనామా ఎందుకు చేశారు? అందుకు దారితీసిన పరిస్థితులు ఏమిటి? విదేశీ శక్తులతో ఆయన చేతులు కలిపారా? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని అస్థిరపరచి ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేసే ప్రయత్నాలు జరిగాయా? ఈ ప్రశ్నలకు సమాధానం లభిస్తే తెర వెనుక ఏం జరిగిందో తెలుస్తుంది. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్‌వర్మను అభిశంసించే విషయంలో కేంద్ర ప్రభుత్వంతో తలెత్తిన విభేదాల వల్ల జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేశారని అప్పట్లో అందరూ భావించారు. సదరు ప్రచారాన్ని మీడియా కూడా నమ్మింది. అయితే తెర వెనుక జరిగింది మరొకటి అని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీని బలహీనపరచడానికి అమెరికాలోని కొన్ని శక్తులు ప్రయత్నించాయి. తమ ప్రయత్నాలకు ఊతం ఇచ్చి ముందుకు తీసుకువెళ్లేది ఎవరా? అని ఆరా తీశారు. ఈ క్రమంలో అప్పటి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, అనిల్ అంబానీలను ఆ శక్తులు ఎంచుకున్నాయట! ఈ ఇరువురూ ప్రధాని మోదీని ఏం చేయగలరు? అన్న ప్రశ్న రావడం సహజం. 2024 సాధారణ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి సొంతంగా మెజారిటీ లభించలేదు. దీంతో బిహార్‌లోని జేడీయూ, ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగుదేశం పార్టీలపై ఆధారపడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నరేంద్ర మోదీకి ఏర్పడింది.

టీడీపీ, జేడీయూతోపాటు చిరాగ్ పాశ్వాన్, అరవింద్ కేజ్రీవాల్ వంటి వాళ్లు సహకరిస్తే ప్రధాని మోదీ ప్రభుత్వం పతనం అవుతుందని, రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయవచ్చునని ఆ శక్తులు అంచనాకు వచ్చాయి. పిల్లి మెడలో గంట కట్టేది ఎవరు? అని ఆరా తీసిన సదరు శక్తులకు అప్పటి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కనిపించారట! రాజ్యసభ ఛైర్మన్‌గా ఉన్న ఆయన అయితే రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరపడం సులువు అవుతుందన్న నిర్ణయానికి వచ్చిన విదేశీ శక్తులు ఆయనను సంప్రదించగా ఓకే చెప్పారట. ధన్‌ఖడ్‌ను కలిసే ముందు ఆయా రాజకీయ పార్టీలతో ప్రాథమిక చర్చలు జరిపే బాధ్యతను అనిల్ అంబానీకి అప్పగించారట! అయితే, అనిల్ అంబానీ కొంత మేరకు మాత్రమే తన పాత్రను పోషించగలిగారు. వ్యాపార పరంగా దెబ్బతిన్న అనిల్ అంబానీని ప్రధాన రాజకీయ పార్టీలు సీరియస్‌గా తీసుకోలేదు. అనిల్ అంబానీ నుంచి ఎన్ని విజ్ఞప్తులు వచ్చినా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు కనీసం అపాయింట్మెంట్ కూడా ఇవ్వలేదు. జేడీయూ అధినేత నితీశ్‌కుమార్, ఆప్ అధినేత కేజ్రీవాల్‌ను మాత్రమే అనిల్ అంబానీ కలుసుకోగలిగారని చెబుతున్నారు. అప్పటికే అనారోగ్యంతో ఉన్న జేడీయూ నేత నితీశ్‌కుమార్ కూడా అనిల్ అంబానీ ప్రతిపాదనలను సీరియస్‌గా తీసుకోలేదు. ఇక కేజ్రీవాల్ వంటి వారు జగదీప్ ధన్‌ఖడ్‌ను కలిసినట్టు అప్పట్లోనే వార్తలొచ్చాయి. అమెరికాలోని శక్తులు మన దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోబోతున్నాయని ఉప్పందుకున్న కేంద్ర ప్రభుత్వ నిఘా సంస్థలు మరింత సమాచార సేకరణలో పడ్డాయి. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ఏదో జరగబోతోందని తెలుసుకున్న చంద్రబాబు, నితీశ్‌కుమార్, చిరాగ్ పాశ్వాన్ వంటివారు విషయాన్ని ప్రధాని మోదీని కలిసి వివరించినట్టు తెలిసింది. అప్పటికే నిఘా వర్గాల ద్వారా కొంత సమాచారాన్ని సేకరించుకున్న ప్రధాని మోదీ ఈ అంశంపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను ఎవరెవరు కలుసుకున్నారో ఆరా తీశారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మంత్రి లోకేశ్‌ను కూడా ఆరా తీశారు. తాను అప్పుడే కాదు -- ఎప్పుడూ జగదీప్ ధన్‌ఖడ్‌ను కలవలేదని ఆయన కేంద్ర పెద్దలకు స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి ఎవరి సహకారం తీసుకోవాలని అనుకున్నారో వారందరూ తెర వెనుక జరుగుతున్న కుట్రల గురించి ప్రధాని మోదీకి చెప్పడంతో కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. ధన్‌ఖడ్, అనిల్ అంబానీ పాత్రను కేంద్ర పెద్దలు ధ్రువీకరించుకున్నారు. ధన్‌ఖడ్‌పై ఉన్న పాత ఈడీ కేసులను తిరగదోడారు. అనిల్ అంబానీపై ఈడీ విచారణ వేగవంతం కావడం అప్పుడే జరిగింది. దీని వెనుక ఇంత కథ నడిచిన విషయం బయటి ప్రపంచానికి తెలియదు. రొటీన్‌గా ఈడీ విచారణ జరుగుతోందని మాత్రమే అంతా భావించారు. ప్రధానికి నమ్మకమైన మిత్రులుగా ఉన్న చంద్రబాబు, నితీశ్‌కుమార్‌ను కదపడం ద్వారా ఈ కుట్ర వెనుక ఉన్నవారు పప్పులో కాలేశారు.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మందగమనం.. తగ్గిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు!

**హైదరాబాద్‌లో మందగించిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు**

**గతేడాదితో పోలిస్తే సెప్టెంబర్‌లో 15 శాతం తగ్గుదల**

**పడిపోయిన బడ్జెట్, మధ్యశ్రేణి గృహాల అమ్మకాలు**

**కోటి రూపాయల పైబడిన ఇళ్లకే కొనసాగుతున్న ఆదరణ**

**మొత్తం లావాదేవీల విలువను నిలబెడుతున్న ప్రీమియం సెగ్మెంట్**



తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ జోరుకు సెప్టెంబర్ నెలలో కాస్త బ్రేకులు పడ్డాయి. గృహాలకు సంబంధించిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ల సంఖ్యలో గత ఏడాదితో పోలిస్తే గణనీయమైన తగ్గుదల నమోదైంది. అయితే, కోటి రూపాయలకు పైబడిన ప్రీమియం ఇళ్ల సెగ్మెంట్ మాత్రం స్థిరమైన డిమాండ్‌తో మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చింది.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా, తెలంగాణ ప్రభుత్వ రిజిస్ట్రేషన్ల శాఖ డేటాను విశ్లేషించి ఈ వివరాలను వెల్లడించింది. దీని ప్రకారం, 2026 సెప్టెంబర్‌లో హైదరాబాద్ (హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు కలిపి) పరిధిలో 5,620 నివాస గృహాల రిజిస్ట్రేషన్లు జరిగాయి. గతేడాది ఇదే నెలలో నమోదైన 6,612 రిజిస్ట్రేషన్లతో పోలిస్తే ఇది 15 శాతం తక్కువ. అదేవిధంగా, లావాదేవీల విలువ కూడా 7 శాతం తగ్గి, రూ.4,804 కోట్ల నుంచి రూ.4,487 కోట్లకు చేరింది. ఆగస్టు 2026 నెలతో పోల్చినా కూడా రిజిస్ట్రేషన్లలో 5 శాతం క్షీణత కనిపించింది.

బడ్జెట్ ఇళ్లపై ప్రభావం, ప్రీమియం సెగ్మెంట్ నిలకడ

ఈ తగ్గుదల ప్రధానంగా బడ్జెట్, మధ్యశ్రేణి గృహాల విభాగంలో ఎక్కువగా కనిపించింది. ?50 లక్షల లోపు విలువైన ఇళ్ల రిజిస్ట్రేషన్లు ఏకంగా 20 శాతం పడిపోగా, రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి మధ్య ఉన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు 6 శాతం తగ్గాయి.

అయితే, దీనికి పూర్తి భిన్నంగా ప్రీమియం సెగ్మెంట్ నిలకడగా రాణించింది. కోటి రూపాయలకు పైబడిన విలువైన ఇళ్ల రిజిస్ట్రేషన్లు 12 శాతం తగ్గినా, వాటి లావాదేవీల విలువలో క్షీణత కేవలం 2 శాతంగానే ఉండటం గమనార్హం. మొత్తం లావాదేవీల విలువలో ఈ సెగ్మెంట్ వాటా గతేడాది 54 శాతం ఉండగా, ఈసారి అది 56 శాతానికి పెరిగింది. ఇది మార్కెట్‌లో అధిక విలువ గల గృహాలకు డిమాండ్ బలంగా ఉందని సూచిస్తోంది.

మొత్తం మీద నిలకడగానే...

సెప్టెంబర్ నెలలో అమ్మకాలు మందగించినప్పటికీ, 2026 క్యాలెండర్ సంవత్సరంలో మొదటి తొమ్మిది నెలల (జనవరి-సెప్టెంబర్) గణాంకాలను పరిశీలిస్తే మార్కెట్ నిలకడగానే ఉంది. ఈ తొమ్మిది నెలల్లో మొత్తం 55,715 యూనిట్లు రిజిస్టర్ కాగా, లావాదేవీల విలువ గతేడాది కంటే 4 శాతం పెరిగి రూ.39,910 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాది ఆరంభంలో ప్రభుత్వం గైడెన్స్ విలువల సవరణ తర్వాత నెలవారీ రిజిస్ట్రేషన్లలో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

నైట్ ఫ్రాంక్ ఇండియా ప్రతినిధి శిశిర్ బైజాల్ మాట్లాడుతూ, "మొత్తం రిజిస్ట్రేషన్ల సంఖ్యలో తగ్గుదల ఉన్నప్పటికీ, అధిక ధర కలిగిన ఇళ్ల అమ్మకాల వాటా పెరగడం వల్ల మొత్తం లావాదేవీల విలువ స్థిరంగా ఉంది. ఇది ప్రీమియం గృహాలకు కొనుగోలుదారుల నుంచి డిమాండ్ కొనసాగుతోందని స్పష్టం చేస్తోంది" అని వివరించారు. రిజిస్టర్ అయిన ప్రాపర్టీలలో 66 శాతం వాటాతో 1,000 నుంచి 2,000 చదరపు అడుగుల మధ్య ఉన్న ఇళ్లే అధికంగా ఉన్నాయి.

# సీఎం రేవంత్‌కు బండ్ల గణేశ్ విజ్ఞప్తి

**పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలంటూ**

**సీఎం రేవంత్ రెడ్డికి బండ్ల గణేశ్ విజ్ఞప్తి**

**అక్రమ నిల్వలతో దాణా ధరలు విపరీతంగా**

**పెంచుతున్నారని ఆరోపణ**

**మొక్కజొన్న, సోయాబీన్ వంటి ముడిసరుకులను**

**గోదాముల్లో దాస్తున్నారని ఆవేదన**



పౌల్ట్రీ పరిశ్రమ ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై తక్షణమే స్పందించి, రైతులను ఆదుకోవాలని ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఈరోజు ఆయన ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఒక ప్రకటన చేశారు. పౌల్ట్రీ పరిశ్రమకు కీలకమైన మొక్కజొన్న, సోయాబీన్, డీఓసీ వంటి ముడిసరుకులను కొందరు స్టాకిస్టులు అక్రమంగా గోదాముల్లో నిల్వ చేస్తున్నారని బండ్ల గణేశ్ ఆరోపించారు. దీనివల్ల మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి, ధరలను అమాంతం పెంచుతున్నారని ఆయన పేర్కొన్నారు. "ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవాలి. పౌల్ట్రీ రంగానికి, రైతులకు న్యాయం జరిగేలా చూడాలి" అని ఆయన కోరారు.

ఇప్పటికే అనేక ఆర్థిక, సాంకేతిక సమస్యలతో సతమతమవుతున్న పౌల్ట్రీ రైతులకు ఈ ధరల పెరుగుదల అదనపు భారంగా మారిందని బండ్ల గణేశ్ తెలిపారు. సంబంధిత అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి, రైతులకు సరసమైన ధరలకు, సకాలంలో ముడిసరుకులు అందేలా చూడాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ పౌల్ట్రీ రైతుల తరఫున తాను ఈ విజ్ఞప్తి చేస్తున్నానని, ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన అన్నారు.

# నీటి వినియోగంపై అదానీ-గూగుల్ కీలక నిర్ణయం.. విశాఖ డేటా సెంటర్లకు ప్రత్యేక టెక్నాలజీ!



ఆంధ్రప్రదేశ్‌ను కీలక డేటా హబ్‌గా మార్చే దిశగా చేపట్టిన ప్రాజెక్టులలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నారు. విశాఖపట్నంలో అదానీ కనెక్ట్స్, గూగుల్ సంయుక్తంగా నిర్మిస్తున్న భారీ డేటా సెంటర్లలో నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించేందుకు అత్యాధునిక ఎయిర్-కూల్డ్ టెక్నాలజీని ఉపయోగించనున్నట్లు సంస్థ ప్రకటించింది. ముదసర్లోవ, తర్లువాడ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న ఈ క్యాంపస్‌లలో ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు.

సాధారణంగా డేటా సెంటర్ల నిర్వహణకు, కూలింగ్ వ్యవస్థలకు భారీ పరిమాణంలో మంచినీరు అవసరమవుతుంది. అయితే, దీనికి భిన్నంగా ఎయిర్-కూలింగ్ టెక్నాలజీని వాడటం ద్వారా నీటి అవసరాన్ని దాదాపుగా తొలగించనున్నారు. ఈ ప్రాజెక్టులన్నింటిలో కలిపి మొత్తం మంచినీటి వినియోగం ఒక ఒలింపిక్ స్విమ్మింగ్ పూల్ పరిమాణం కంటే తక్కువగానే ఉంటుందని అంచనా. ఇందులో కూడా 80 శాతం నీటిని కేవలం ఉద్యోగుల సౌకర్యాలు, వంటగదులు, పచ్చదనం పెంపకం వంటి అవసరాలకే కేటాయించనున్నారు.

ఈ ప్రాజెక్టులు ముదసర్లోవ రిజర్వాయర్, కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యం సమీపంలో ఉండటంతో నీటి వనరులపై ప్రభావం చూపుతాయనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో, గృహ అవసరాలకు వినియోగించే నీటి వనరులపై ఆధారపడకుండా, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ వాటర్ కనెక్షన్ల ద్వారానే నీటిని సేకరించనున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. అంతేకాకుండా, 'జీరో-డిశ్చార్జ్' విధానాన్ని పాటిస్తూ, ప్రాజెక్టులో వెలువడే మురుగునీటిని ఆన్‌సైట్ ప్లాంట్‌లో శుద్ధి చేసి, ఇరిగేషన్, ఫ్లషింగ్ వంటి అవసరాలకు తిరిగి వినియోగిస్తారు. శుద్ధి చేసిన నీటిని కూడా ముదసర్లోవ రిజర్వాయర్‌లోకి వదిలే ప్రసక్తే లేదని హామీ ఇచ్చారు.

అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎడ్జ్‌కనెక్స్ సంస్థల జాయింట్ వెంచరే ఈ అదానీ కనెక్ట్స్. గూగుల్‌తో కలిసి దాదాపు 1 గిగావాట్ సామర్థ్యంతో హైపర్‌స్కేల్ డేటా సెంటర్లను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ సంస్థ పనిచేస్తోంది. ఈ ప్రాజెక్టులతో పాటు రిలయన్స్, ఎయిర్‌టెల్ వంటి సంస్థల కార్యకలాపాలతో విశాఖపట్నం త్వరలో దేశంలోనే ఒక ముఖ్యమైన డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్‌గా మారనుంది.

RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 19 అక్టోంబర్ 2026 సోమవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:122

## నిరుద్యోగులకు గుడ్‌న్యూస్..
## ఆ పోస్టుల భర్తీకి రేవంత్ సర్కార్ గ్రీన్‌సిగ్నల్




హైదరాబాద్, అక్టోబరు 18 : తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ అనుమతి ఇచ్చింది. తొలి విడతలో ప్రత్యక్ష నియామకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉస్మానియా యూనివర్సిటీలో అత్యధికంగా 252 పోస్టులను భర్తీచేయనుంది అలాగే, కాకతీయ, శాతవాహన యూనివర్సిటీల్లో చెరో 49 పోస్టులు, పాలమూరు యూనివర్సిటీలో 45 పోస్టులు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, తెలుగు యూనివర్సిటీల్లో చెరో 16 పోస్టులు, తెలంగాణ యూనివర్సిటీలో రెండు పోస్టులను భర్తీ చేయనుంది. ఈ నియామక ప్రకటనల జారీకి తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.

# కలలకు పుట్టినిల్లు తెలంగాణ.

## తెలంగాణ ప్రజలకు దసరా శుభాకాంక్షలు
## రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల.

కలలకు పుట్టినిల్లు తెలంగాణ అని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు.

ఆదివారం ట్యాంక్ బండ్ పై సద్దుల బతుకమ్మ ఉత్సవ వేడుకల్లో గవర్నర్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.




ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ పవిత్ర పర్వదినాన్ని



పురస్కరించుకుని తెలంగాణలోని సోదర సోదరీమణులకు, దేశ విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

బతుకమ్మ పండుగ తెలంగాణ సుసంపన్న సాంస్కృతిక వారసత్వానికి, నారీ శక్తికి, ప్రకృతి పట్ల మనకున్న ప్రగాఢమైన భక్తికి సజీవ ప్రతీక అని ఆయన పేర్కొన్నారు.

రంగురంగుల పూలతో అలంకరించే బతుకమ్మ మన ఉనికికి ఆధారమైన మానవునికి, ప్రకృతికి మధ్య గల విడదీయరాని బంధాన్ని గుర్తుచేస్తుందని ఆయన వివరించారు.

తరతరాలుగా ఈ అమూల్యమైన సంప్రదాయాన్ని కాపాడుకుంటూ వస్తున్న తల్లులు, సోదరీమణుల సృజనాత్మకత, అంకితభావం ఎంతో ప్రశంసనీయమని ఆయన కొనియాడారు.

పూలను దైవ స్వరూపంగా భావించి పూజించే ఈ విశిష్ట పండుగ ప్రకృతిని గౌరవించడమే మానవ జీవిత భవిష్యత్తు అని సమాజానికి చాటిచెబుతుందని ఆయన తెలిపారు.

ఎల్ నినో వంటి ప్రపంచ వాతావరణ సవాళు ్లు, ప్రకృతి వైపరీత్యాలు ఎదురవుతున్న ప్రస్తుత తరుణంలో ప్రకృతి పట్ల మన బాధ్యత మరింత పెరిగిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదైందని, ఇది మనకు ఒక స్పష్టమైన హెచ్చరిక అని ఆయన గుర్తుచేశారు.

ప్రకృతి సమతుల్యతలో వచ్చిన ఈ మార్పును గమనించకుండా సహజ వనరులను విచక్షణారహితంగా వినియోగిస్తే తీవ్రమైన జల సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

బతుకమ్మ పండుగ వేళ ప్రకృతిని, దాని అత్యంత విలువైన వనరైన నీటిని సంరక్షించుకోవడమే నిజమైన దైవారాధన అని ఆయన ఉద్ఘాటించారు.

నీటి సంరక్షణను కేవలం ప్రభుత్వ బాధ్యతగా మాత్రమే పరిగణించకుండా, ప్రతి పౌరుడు తన ప్రథమ కర్తవ్యంగా స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నీటి ఎద్దడి తీవ్రమయ్యే వరకు వేచి చూడకుండా, తక్షణమే నీటి వృధాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఆయన కోరారు.

వర్షపు నీటి సంరక్షణ (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్), చెరువుల పరిరక్షణ, భూగర్భ జలాల పునర్భరణ ప్రస్తుత కాలానికి అత్యంత ఆవశ్యకమని ఆయన నొక్కిచెప్పారు.

ప్రస్తుత నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ పద్ధతుల్లో తగిన మార్పులు తీసుకురావాలని ఆయన రైతు సోదరులను ప్రత్యేకంగా అభ్యర్థించారు.

అధిక నీరు అవసరమయ్యే పంటల స్థానంలో తక్కువ నీటితో పండే, స్థానిక వాతావరణానికి అనుకూలమైన పంటలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన రైతులకు సూచించారు.

బతుకమ్మ పండుగ యొక్క అంతఃసూత్రాన్ని ఆచరిస్తూ పర్యావరణాన్ని కాపాడుకోవాలని, రాబోయే తరాల సురక్షితమైన, సమృద్ధికరమైన భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మహిళా సాధికారత, సామాజిక సామరస్యం, ప్రకృతి ప్రేమను ప్రోత్సహించే ఈ మహత్తర సందర్భంలో ప్రజలందరికీ బతుకమ్మ, నవరాత్రి, విజయదశమి పండుగల శు భాకాంక్షలు అందజేశారు.

గౌరీ దేవి కటాక్షంతో తెలంగాణలోని ప్రతి ఇంటా సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆయన ప్రార్థించారు.

మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క పండుగ యొక్క విశిష్టత పై మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి డి. అనసూయ సీతక్క, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్, జర్మనీ కాన్సుల్ జనరల్ అమితా దేశాయ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ ఐఏఎస్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, టి ఎస్ ఎస్ చైర్మన్ వెన్నెల గద్దర్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, టి ఎస్ ఎస్ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి, జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ మంగతాయారు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, సినీ నటులు విజయ్ దేవరకొండ రష్మిక, కళాబృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నితీశ్ పై పీకే అనూహ్య ప్రశంసలు.. బీహార్ టాప్-10 నేతల్లో ఒకరంటూ కితాబు

**నితీశ్ ఆరోగ్యంగా ఉన్నప్పుడు రాష్ట్రం కోసం చిత్తశుద్ధితో పనిచేశారన్న ప్రశంస**

**వైశాలి పడవ ప్రమాద బాధితులతో దసరా జరుపుకుంటానని ప్రకటన**

**కులం, మతం పక్కన పెట్టి ఓటెయ్యాలని ప్రజలకు పిలుపు**

జన సురాజ్ పార్టీ అధినేత, ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే), బీహార్ మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై అనూహ్యంగా ప్రశంసల వర్షం కురిపించారు. బీహార్ చరిత్రలోనే అత్యంత సమర్థవంతమైన, సమాజం పట్ల శ్రద్ధ ఉన్న పది మంది ఉత్తమ నేతల్లో నితీశ్ ఒకరని అభివర్ణించారు. వైశాలిలో బీహార్ శాసనమండలి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.



నితీశ్ కుమార్ గురించి పీకే మాట్లాడుతూ, "ఆయన ఆరోగ్యంగా, చురుకుగా ఉన్నప్పుడు రాష్ట్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేశారు. అయితే, ఆయన అనారోగ్యంతో ఉన్న సమయంలో ఇతరులు ఆయన పేరుతో ప్రభుత్వాన్ని నడిపారు. ఆ సమయంలో జరిగిన అనేక అవకతవకలను నేను వ్యతిరేకించాను" అని గుర్తుచేశారు. జేడీయూ ఎమ్మెల్యే అనంత్ సింగ్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలోనూ నితీశ్‌ను సమర్థిస్తూ, ఆయనను ఒక వివేకవంతమైన నాయకుడిగా అభివర్ణించారు. పాట్నా గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంలో నితీశ్‌కు బలమైన మద్దతు ఉంది. ఈ నేపథ్యంలో ఆ ఓటర్లను ఆకట్టుకునే వ్యూహంలో భాగంగానే పీకే ఈ వ్యాఖ్యలు చేసినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. గతంలో నితీశ్‌కు అత్యంత సన్నిహితుడిగా, జేడీయూ జాతీయ ఉపాధ్యక్షుడిగా పీకే పనిచేసిన విషయం తెలిసిందే.

మరోవైపు, ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరిపై తాను చేసిన వ్యాఖ్యలకు సంబంధించి వైరల్ అవుతున్న వీడియో క్లిప్‌పైనా పీకే స్పందించారు. "పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన ప్రతి ఒక్కరినీ కాల్చివేయాలనే వాదన సరైతే, ఆ లెక్కన సామ్రాట్ చౌదరి కూడా నేరస్థుడే అవుతారు. నా వ్యాఖ్యలు తప్పయితే ప్రభుత్వం నాపై కేసు నమోదు చేయవచ్చు" అని సవాల్ విసిరారు. కులం, మతాలకు అతీతంగా విద్య, ఉపాధి, ఉపాధ్యాయుల గౌరవం కోసం ఓటు వేయాలని ప్రజలను కోరారు.

ఇదే ప్రచారంలో భాగంగా వైశాలిలో జరిగిన పడవ ప్రమాదంలో 15 మంది చిన్నారులు మరణించడంపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. దసరా పండుగను ఆ బాధిత కుటుంబాలతోనే గడుపుతానని ప్రకటించారు. వారిని పరామర్శించడానికి ఎన్డీయే ప్రభుత్వం నుంచి ఎవరూ రాకపోవడాన్ని తప్పుబట్టారు.

## భారత్ మాకు ముఖ్య మిత్రదేశం: రష్యా ఆయిల్ కొనుగోళ్లపై అమెరికా కీలక వ్యాఖ్యలు

**రష్యా ఇంధన కొనుగోళ్లపై ఆంక్షల నుంచి భారత్‌కు తాత్కాలిక మినహాయింపు**

**60 రోజుల పాటు మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్ ప్రభుత్వం**

**భారత్ ఒక్కసారిగా మారడం కష్టమని అమెరికా వ్యాఖ్య**

**భవిష్యత్తులో టారిఫ్‌ల ముప్పు పూర్తిగా తొలగిపోలేదని సంకేతాలు**



భారత్ అమెరికాకు అత్యంత ముఖ్యమైన మిత్రదేశమని, ఇంధన అవసరాల కోసం రష్యాపై ఆధారపడటాన్ని ఒక్క రోజులో మార్చుకోవడం కష్టమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో వ్యాఖ్యానించారు. రష్యా నుంచి భారీగా ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటున్న భారత్‌కు అమెరికా తాత్కాలిక ఊరట కల్పిస్తూ అమెరికా నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రుబియో ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాపై విధించిన ఆంక్షల చట్టం నుంచి భారత్ సహా కొన్ని దేశాలకు 60 రోజుల పాటు మినహాయింపు ఇస్తున్నట్లు అమెరికా ప్రకటించింది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శు క్రవారం 'లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్' కింద ఈ వెయివర్‌పై సంతకం చేశారు. ఈ చట్టం ప్రకారం, రష్యా నుంచి అధిక మొత్తంలో చమురు, గ్యాస్ కొనుగోలు చేసే టాప్ 5 దేశాల (భారత్, చైనా సహా) నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే వస్తువులపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారం ఉంది. అయితే, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ట్రంప్ ఈ నిబంధనలను తాత్కాలికంగా నిలిపివేశారు.

శనివారం వాషింగ్టన్‌లో విలేకరులతో మాట్లాడిన మార్కో రుబియో, ఈ నిర్ణయం వెనుక గల కారణాలను వివరించారు. "ఈ ఆంక్షలు కేవలం రష్యాపైనే కాదు. భారత్ వంటి ఇతర దేశాలపైనా టారిఫ్‌ల రూపంలో ప్రభావం చూపుతాయి. అందుకే అధ్యక్షుడు 60 రోజుల సమయం తీసుకుని, ప్రపంచ, అమెరికా ఆర్థిక వ్యవస్థలపై పడే ప్రభావాన్ని అధ్యయనం చేయాలని భావిస్తున్నారు" అని తెలిపారు. భారత్ ఇంధన వనరులను వైవిధ్యపరుచుకుంటున్నప్పటికీ, రష్యా నుంచి ఇంకా గణనీయమైన మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తోందని, ఇది ఒక్కరోజులో మారే ప్రక్రియ కాదని ఆయన స్పష్టం చేశారు.

ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా నుంచి చౌకగా ముడి చమురు లభించడంతో భారత్ భారీగా దిగుమతులను పెంచుకుంది. ప్రస్తుతం భారత్‌కు రష్యానే అతిపెద్ద చమురు సరఫరాదారుగా ఉంది. అయితే, తమ ఇంధన భద్రత కోసం వివిధ దేశాల నుంచి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కొనుగోళ్లు జరుపుతామని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉజ్బెకిస్థాన్, భారత్ పర్యటనలో ఉన్న రుబియో, భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశమై, జామ్‌నగర్‌లోని రిఫైనరీని సందర్శించనున్నారు. ఈ 60 రోజుల అధ్యయనం తర్వాత అమెరికా తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఈ మినహాయింపు భారత్‌కు ఉపశమనం కలిగించినప్పటికీ, భవిష్యత్తులో టారిఫ్‌ల ముప్పు పూర్తిగా తొలగిపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఏపీలో మున్సిపల్ ఎన్నికలు.. ముగిసిన నామినేషన్ల గడువు

**చివరి రోజు భారీగా తరలివచ్చిన అభ్యర్థులు**

**దర్శిలో సమయానికి చేరుకోలేక 25 మంది**

**వైసీపీ అభ్యర్థుల వెనుదిరిగిన వైనం**

**అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన, 28న పోలింగ్**

**అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి**

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ ముగిసింది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు విధించిన గడువు ఆదివారం (అక్టోబర్ 18) మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. చివరి రోజు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు అభ్యర్థులు, వారి మద్దతుదారులతో కిటకిటలాడాయి.

ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి కార్యాలయ ప్రాంగణాల్లో ఉన్న వారందరికీ అధికారులు టోకెన్లు జారీ చేసి, వారి నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో పురపోరు రసవత్తరంగా మారనుంది.



**దర్శిలో వైసీపీకి ఎదురుదెబ్బ**

ప్రకాశం జిల్లా దర్శిలో వైసీపీకి ఊహించని పరిణామం ఎదురైంది. గడువు ముగియడంతో దాదాపు 25 మంది వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారు. సమయానికి కార్యాలయానికి చేరుకోలేకపోవడంతో వారు నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశమైంది.

**తదుపరి షెడ్యూల్ ఇదే**

నామినేషన్ల పర్వం ముగియడంతో ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియపై దృష్టి సారించింది. షెడ్యూల్ ప్రకారం, రేపు (అక్టోబర్ 19) నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 21 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత బరిలో నిలిచే తుది అభ్యర్థులపై స్పష్టత రానుంది. అక్టోబర్ 28న పోలింగ్ జరగనుండగా, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు.

# ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. గవర్నర్‌ను కలిసిన జగన్

**స్థానిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార పక్షం**
**అక్రమాలకు పాల్పడుతోందని ఫిర్యాదు**
**ఎన్నికల ప్రక్రియకు కేంద్ర బలగాల**
**పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి**
**ఓటమి భయంతోనే చంద్రబాబు**
**దాడులు చేయిస్తున్నారని ఆరోపణ**
**ప్రజాస్వామ్య పరిరక్షణకు న్యాయపరమైన**
**పోరాటం చేస్తామని స్పష్టీకరణ**

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కోరారు. ఆదివారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార కూటమి అప్రజాస్వామిక పద్ధతులకు పాల్పడుతోందని, ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు.



సమావేశం అనంతరం జగన్ మీడియాలో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంతటి అప్రజాస్వామిక వాతావరణాన్ని తానెప్పుడూ చూడలేదని అన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం కేంద్ర బలగాల పర్యవేక్షణలో, సీసీటీవీ కెమెరాల నిఘాలో జరిపేలా చూడాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. వైసీపీ అభ్యర్థులను నామినేషన్ కేంద్రాల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, అదే సమయంలో టీడీపీ మద్దతుదారులను లోపలికి అనుమతించి దాడులు చేయిస్తున్నారని గవర్నర్‌కు వివరించినట్లు చెప్పారు. ఈ అరాచకాలకు పోలీసులు కూడా అధికారపక్షానికే మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలోని 8 ప్రాంతాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని, మరో 19 చోట్ల కేవలం 36 శాతం నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకో 8 ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేశారని తెలిపారు. పులివెందులలో 36 వార్డులకు గాను కేవలం 19 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ ఎంపీలు అవినాశ్ రెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి పట్ల వ్యవహరించిన తీరు, అభ్యర్థులపై పోలీసుల కాల్పులు, తప్పుడు కేసులు బనాయించడం వంటి అంశాలను కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. క్రియాశీలకంగా ఉన్న వైసీపీ కార్యకర్తలను భయపెట్టేందుకు బైండోవర్ కేసుల కుట్ర జరుగుతోందని జగన్ ఆరోపించారు. "ఓటమి భయంతోనే చంద్రబాబు ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారు. పోటీ చేయాలనుకునేవారికి అవకాశం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ. దీనిపై న్యాయపరమైన మార్గాలతో సహా అన్ని అవకాశాలను అన్వేషిస్తాం" అని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా పోరాడాలని, త్వరలోనే పరిస్థితులు మారతాయని ఆయన పిలుపునిచ్చారు.

**ఈసీల నియామకంపై తప్పుచేశాం: పశ్చాత్తాపం వ్యక్తం చేసిన జగన్**

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర కమిషనర్ల నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం 2023లో తీసుకొచ్చిన చట్టానికి అప్పట్లో మద్దతివ్వడం తాము చేసిన పెద్ద తప్పిదమని, అందుకు ఇప్పుడు చింతిస్తున్నామని జగన్ విచారం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న పార్టీయే ఎన్నికల కమిషనర్లను నియమించే ప్రక్రియను నియంత్రించకూడదని, ఈ విధానంపై ఇప్పుడు పశ్చాత్తాపం చెందుతున్నామని ఆయన అన్నారు. అంతకుముందు ఎస్ఈసీ అనిల్ పునేఠాను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ జగన్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

కేంద్రంలో అయినా, రాష్ట్రంలో అయినా ఎన్నికల కమిషనర్లను అధికార పార్టీ నామినేట్ చేయకూడదని జగన్ స్పష్టం చేశారు. "గతంలో కేంద్రంలో అధికార పార్టీయే ఎన్నికల కమిషనర్‌ను నామినేట్ చేసే విధానానికి వైసీపీ మద్దతు ఇచ్చింది. కానీ ఆ రోజు మేము చేసిన తప్పుకు ఇప్పుడు బాధపడుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. "పరీక్ష రాసే విద్యార్థే తనకు ఇన్విజిలేటర్‌ను నియమించుకున్నట్లుగా ఈ విధానం ఉంది. ఎంత నిజాయతీపరుడైన అధికారి అయినా, నియామకం నిష్పక్షపాతంగా జరగనప్పుడు విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది" అని జగన్ అభిప్రాయపడ్డారు.

ప్రస్తుత నియామక పద్ధతిలో లోపాలున్నాయని జగన్ వివరించారు. ఈ విధానంలో ప్రధానమంత్రి, ఆయన నామినేట్ చేసిన మరో మంత్రికి రెండు ఓట్లు, ప్రతిపక్ష నేతకు ఒక ఓటు ఉంటుందని, దీంతో ప్రభుత్వానికి అనుకూలమైన వ్యక్తే కమిషనర్‌గా నియమితులవుతారని తెలిపారు. ఈ వ్యవస్థలో ఉన్న లోపాన్ని తాము తప్పు చేసిన తర్వాతే గ్రహించామని అన్నారు. ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను కాపాడటానికి పాత పద్ధతినే పునరుద్ధరించాలని, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ), ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ ద్వారానే ఈసీలను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. కమిటీలో సీజేఐ ఉండటం వల్ల నియామక ప్రక్రియ నిష్పక్షపాతంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నియామకంలో కూడా ఇదే తరహా సంస్కరణలు తీసుకురావాలని జగన్ కోరారు.

# హైదరాబాద్‌లో బతుకమ్మ వేడుకలు.. పాల్గొన్న సీతక్క

హైదరాబాద్, అక్టోబర్ 18: నగరంలోని రాష్ట్ర సచివాలయం సమీపంలో అమరజ్యోతి ప్రాంగణం వద్ద బతుకమ్మ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఆమె ఆధ్వర్యంలో ఇతర మహిళలతో కలిసి బతుకమ్మ పాటలు పాడారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క పూలను అందంగా పేర్చి.. బతుకమ్మను సిద్ధం చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవనశైలికి ప్రతీకగా నిలిచే ఈ బతుకమ్మ పండుగను వారంతా సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు.



దీంతో అమరజ్యోతి ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, మహిళల ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ బతుకమ్మ వేడుకలకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు భారీ ఎత్తున తరలి వచ్చారు.

తెలంగాణలో బతుకమ్మ పండుగకు ప్రత్యేకమైన సాంస్కృతిక ప్రాధాన్యం ఉన్న సంగతి తెలిసిందే. ప్రకృతిని ఆరాధిస్తూ, వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి, మహిళలు సమూహాలుగా ఏర్పడి పాటలు పాడుతూ ఈ పండుగను జరుపుకుంటారు. ఈ బతుకమ్మ పండుగ తెలంగాణ జీవన విధానాన్ని ప్రతిబింబిస్తుంది. మహిళల మధ్య ఐక్యత, ఆత్మీయతను పెంపొందించడంలోనూ ఈ పండుగ కీలక పాత్ర పోషిస్తుంది.

# పంజాబ్‌లో ఉపాధి హామీ కార్మికులపై దూసుకెళ్లిన కారు.. 8 మంది దుర్మరణం

పంజాబ్‌లోని సంగ్రూర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఉపాధి హామీ కార్మికులపై కారు దూసుకెళ్లడంతో 8 మంది కార్మికులు చనిపోయారు. సంగ్రూర్ జిల్లాలోని లెహ్రాగాగా-జఖర్ రోడ్డులో ఆదివారం ఈ ఘోర ప్రమాదం జరిగింది.

పంజాబ్‌లో ఉపాధి హామీ కార్మికులపై దూసుకెళ్లిన కారు.. 8 మంది దుర్మరణం

పంజాబ్‌లోని సంగ్రూర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఉపాధి హామీ కార్మికులపై కారు దూసుకెళ్లడంతో 8 మంది కార్మికులు చనిపోయారు. సంగ్రూర్ జిల్లాలోని లెహ్రాగాగా-జఖర్ రోడ్డులో ఆదివారం ఈ ఘోర ప్రమాదం జరిగింది. దాదాపు 25 మంది కార్మికులు రోడ్డు పక్కన పనిచేసుకుంటూ ఉండగా.. ఒక కారు అకస్మాత్తుగా వారిపై నుంచి దూసుకెళ్లిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారని పోలీసులు చెప్పారు. ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే చనిపోగా.. మిగతా ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారని పోలీసులు వెల్లడించారు. అలాగే, గాయపడిన మరికొందరిని ఆసుపత్రికి తరలించారు.




మృతులందరినీ సంగ్రూర్ జిల్లా లెహ్రాగాగా సమీపంలోని అలిషెర్ గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. ఇక.. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను గుర్తించామని, అతడిని ట్రేస్ చేశామని సంగ్రూర్ పోలీస్ సూపరింటెండెంట్ పర్విందర్ చీమా తెలిపారు. త్వరలోనే అతడిని అదుపులోకి తీసుకుంటామని వెల్లడించారు. అతడిని పర్గాత్ సింగ్ అలియాస్ కాలాగా గుర్తించామని చెప్పారు. ప్రమాదానికి కారణమైన కారుకు పంజాబ్ రిజిస్ట్రేషన్ నంబర్ ఉందని వెల్లడించారు. రోడ్డు ప్రమాద ఘటనపై పంజాబ్ క్యాబినెట్ మంత్రి కుమార్ గోయల్ విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

# ప్రజల దృష్టి మళ్లించేందుకే రాష్ట్రపతి పాలన డిమాండ్: పల్లా శ్రీనివాసరావు

**వైసీపీనే క్షేత్రస్థాయిలో గొడవలు సృష్టిస్తోందని పల్లా ఆరోపణ**

**జగన్‌పై ఉన్న కేసులను గుర్తు చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు**

**స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణే**

**కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం**



రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలంటూ వైసీపీ చేస్తున్న డిమాండ్, ప్రజల దృష్టిని మళ్లించేందుకు పన్నిన రాజకీయ ఎత్తుగడ అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. ఒకవైపు క్షేత్రస్థాయిలో ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టిస్తూ, మరోవైపు శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించడం వైసీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆయన ఆదివారం మీడియా సమావేశంలో మండిపడ్డారు.

జగన్‌రెడ్డితో పాటు వైసీపీ నేతలపై ఉన్న క్రిమినల్ కేసుల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ఈ డ్రామా ఆడుతున్నారని పల్లా ఆరోపించారు. అక్రమాస్తుల కేసులో జగన్‌రెడ్డి 16 నెలల పాటు జైలులో ఉన్న విషయాన్ని, వివేకా హత్య కేసులో సీబీఐ ఎంపీ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయడానికి వచ్చినప్పుడు 'గొడ్డలిపార్టీ' వ్యవహరించిన తీరును ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తుచేశారు. తమపై ఉన్న ఆరోపణలకు సమాధానం చెప్పకుండా, రాష్ట్రపతి పాలన అంటూ కొత్త నాటకానికి తెరతీయడం రాజకీయ కపటత్వమని దుయ్యబట్టారు.

గత ఎన్నికల సమయంలో వైసీపీ వ్యవహరించిన తీరును ప్రజలు చూశారని, ఇప్పుడు కూడా అదే తరహాలో వివాదాలు సృష్టించి ఆ నెపాన్ని ప్రభుత్వంపై నెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం ఉద్రిక్తతలు పెంచే ప్రయత్నాలను సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే ముందు, గత ఐదేళ్ల తమ పాలనలో వ్యవహరించిన తీరుపై వైసీపీ ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు.

రాష్ట్రంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ప్రతి అభ్యర్థి ఎలాంటి ఆటంకాలు లేకుండా నామినేషన్ వేసేలా, ప్రతి ఓటరు భయం లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైసీపీ రెచ్చగొట్టే ప్రకటనలను నమ్మవద్దని, వాస్తవాలను గమనించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ‘ఐఫోన్ డ్యుయో’కి భారీ డిమాండ్.. నిమిషాల్లోనే స్టాక్ ఖాళీ.. కొనాలంటే 2027 వరకూ ఆగాల్సిందే!

**మార్కెట్లోకి యాపిల్ తొలి ఫోల్డబుల్ ఐఫోన్ డ్యుయో**
**ప్రారంభమైన నిమిషాల్లోనే అమ్ముడైన ప్రీ-ఆర్డర్ స్టాక్**
**భారత్‌లో రూ. 2.99 లక్షల నుంచి ప్రారంభమవుతున్న ధర**
**డెలివరీ కోసం 2027 జనవరి వరకు ఆగాల్సిన పరిస్థితి**
**ఏ20 ప్రో చిప్‌సెట్, డ్యూయల్ స్క్రీన్‌తో వస్తున్న కొత్త మోడల్**



టెక్ దిగ్గజం యాపిల్ నుంచి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న తొలి ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ ‘ఐఫోన్ డ్యుయో’ మార్కెట్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా ప్రీ-ఆర్డర్లు ప్రారంభమైన కొన్ని నిమిషాల్లోనే తొలి విడత స్టాక్ మొత్తం అమ్ముడుపోయింది. విపరీతమైన డిమాండ్ కారణంగా ఇప్పుడు ఈ ఫోన్ డెలివరీ కోసం 2027 ఆరంభం వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

భారత్‌లోనూ ఐఫోన్ డ్యుయోకి అపూర్వ స్పందన లభించింది. ప్రీ-బుకింగ్స్ మొదలైన తొలిరోజే దేశంలోని యాపిల్ రిటైల్ స్టోర్లలో స్టోర్ పిక్-అప్ స్లాట్లన్నీ నిండిపోయాయి. ఆన్‌లైన్‌లో ఆర్డర్లు అందుబాటులో ఉన్నప్పటికీ, ఇప్పుడు బుక్ చేసుకుంటున్న వారికి డెలివరీ తేదీలు 2027 జనవరి ద్వితీయార్థం లేదా ఫిబ్రవరి ఆరంభంలో చూపిస్తున్నాయి. అధికారికంగా ఈ ఫోన్ అక్టోబర్ 23 నుంచి రిటైల్ స్టోర్లలో విక్రయానికి రానుంది.

భారత్‌లో ధరలు ఇలా!

ఐఫోన్ డ్యుయో ధరలు ప్రీమియం సెగ్మెంట్‌లో భారీ స్థాయిలో ఉన్నాయి. వివిధ వేరియంట్ల ధరలు కింద విధంగా ఉన్నాయి: 256+B: రూ. 2,99,900 512+B: రూ. 3,24,900 1TB: రూ. 3,74,900 2TB: రూ. 4,49,900

ప్రధాన ఫీచర్లు

ఈ ఫోన్ స్టార్ వైట్, నైట్ స్కై అనే రెండు ఆకర్షణీయమైన రంగుల్లో అందుబాటులో ఉంది. ఇందులో 5.4 అంగుళాల ఔటర్ డిస్‌ప్లే, మడత విప్పినప్పుడు 7.6 అంగుళాల ఇన్నర్ సూపర్ రెటీనా ఎక్స్‌డీఆర్ స్క్రీన్ ఉన్నాయి. యాపిల్ సొంతంగా అభివృద్ధి చేసిన శక్తిమంతమైన ఏ20 ప్రో చిప్‌సెట్‌తో పనిచేసే ఈ ఫోన్, లేటెస్ట్ ఐఓఎస్ 27 ఆపరేటింగ్ సిస్టమ్‌పై నడుస్తుంది. కేవలం ఈ-సిమ్‌కు మాత్రమే సపోర్ట్ చేయడం దీనిలోని మరో ముఖ్యమైన అంశం.

కొనుగోలుదారులను ఆకర్షించేందుకు ట్రేడ్-ఇన్ క్రెడిట్లు, నో-కాస్ట్ ఈఎంఐ సౌకర్యాలు, ఎంపిక చేసిన బ్యాంకు కార్డులపై పరిమిత క్యాష్‌బ్యాక్ వంటి ఆఫర్లను యాపిల్ అందిస్తోంది. అధిక ధర ఉన్నప్పటికీ ఐఫోన్ డ్యుయోకి లభించిన అనూహ్య స్పందన, యాపిల్ బ్రాండ్‌పై వినియోగదారులకు ఉన్న నమ్మకాన్ని స్పష్టం చేస్తోంది.

# యాపిల్ తొలి ఫోల్డబుల్ ఫోన్: భారత్‌లో ఐఫోన్ డ్యుయో ప్రీ-బుకింగ్స్ షురూ!

**భారత్‌లో ప్రారంభమైన యాపిల్ తొలి ఫోల్డబుల్ ఫోన్ ఐఫోన్ డ్యుయో ప్రీ-బుకింగ్స్**
**రూ. 2,99,900 ప్రారంభ ధరతో అత్యంత ఖరీదైన స్మార్ట్‌ఫోన్‌గా గుర్తింపు**
**7.6 అంగుళాల ఇన్నర్, 5.4 అంగుళాల ఔటర్ డిస్‌ప్లేలతో బుక్-స్టైల్ డిజైన్**
**అత్యాధునిక ఏ20 ప్రో చిప్‌సెట్, 48ఎంపీ ఫ్యూజన్ కెమెరా సిస్టమ్**
**సైడ్ బటన్‌లో టచ్ ఐడీని తిరిగి తీసుకొచ్చిన యాపిల్**



ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్, ఎంతోకాలంగా నిరీక్షిస్తున్న తన మొట్టమొదటి ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది. “ఐఫోన్ డ్యుయో” పేరుతో వస్తున్న ఈ కొత్త తరం ఫోన్ ప్రీ-ఆర్డర్లు శుక్రవారం సాయంత్రం 5:30 గంటలకు దేశవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 23 నుంచి ఇవి అధికారికంగా అమ్మకానికి రానున్నాయి. ఈ ఫోన్‌తో యాపిల్ సంస్థ, అత్యంత పోటీ ఉన్న ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్‌లో అధికారికంగా అడుగుపెట్టింది.

భారీ ధర.. అయినప్పటికీ తగ్గని ఆసక్తి

యాపిల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన స్మార్ట్‌ఫోన్‌లలో ఒకటిగా ఐఫోన్ డ్యుయో నిలిచింది. దీని ధరలు వినియోగదారులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. వివిధ వేరియంట్ల ధరల వివరాలు ఇలా ఉన్నాయి:

256జీబీ వేరియంట్: రూ. 2,99,900
512జీబీ వేరియంట్: రూ. 3,24,900
1టీబీ వేరియంట్: రూ. 3,74,900
2టీబీ వేరియంట్: రూ. 4,49,900

ధర ఇంత అధికంగా ఉన్నప్పటికీ, ఈ ఫోన్ పట్ల వినియోగదారుల్లో విశేష ఆసక్తి కనిపిస్తోందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 2026 నాటికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 6 మిలియన్ యూనిట్లు అమ్ముడయ్యే అవకాశం ఉందని నివేదికలు సూచిస్తున్నాయి. యాపిల్ ఆన్‌లైన్ స్టోర్, అధీకృత రిటైల్ భాగస్వాములు, ప్రముఖ ఆఫ్‌లైన్ అవుట్‌లెట్ల ద్వారా కస్టమర్లు ఈ ఫోన్‌ను ప్రీ-బుక్ చేసుకోవచ్చు.

డిజైన్ మరియు డిస్‌ప్లే ప్రత్యేకతలు

ఐఫోన్ డ్యుయో బుక్-స్టైల్ ఫోల్డింగ్ డిజైన్‌తో రూపొందించబడింది. ఇందులో రెండు డిస్‌ప్లేలు ఉన్నాయి. ఫోన్‌ను తెరిచినప్పుడు 7.6 అంగుళాల భారీ సూపర్ రెటినా శణ= ఇన్నర్ డిస్‌ప్లే కనిపిస్తుంది. ఇది ఇప్పటివరకు వచ్చిన ఐఫోన్‌లలో కెల్లా అతిపెద్ద డిస్‌ప్లే కావడం విశేషం. ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ కంటే ఇది 50 శాతం అదనపు వ్యూయింగ్ ఏరియాను అందిస్తుందని కంపెనీ పేర్కొంది. ఇక బాహ్య భాగంలో 5.4 అంగుళాల సూపర్ రెటినా శణ= డిస్‌ప్లేను అమర్చారు.

ఈ రెండు స్క్రీన్లు ప్రోమోషన్ టెక్నాలజీ, ఆల్వేస్-ఆన్ ఫంక్షనాలిటీకి మద్దతు ఇస్తాయి. ఇవి గరిష్ఠంగా 3,000 నిట్స్ బ్రైట్‌నెస్‌ను అందిస్తాయి. ఇన్నర్ ప్యానెల్‌పై కాంతి పరావర్తనాన్ని తగ్గించేందుకు ప్రత్యేకంగా నానో-టెక్స్చర్ ఫినిష్ ఇచ్చారు.

శక్తివంతమైన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్

ఈ ఫోల్డబుల్ ఫోన్‌లో యాపిల్ తన లేటెస్ట్ ఏ20 ప్రో చిప్‌సెట్‌ను ఉపయోగించింది. మెరుగైన పనితీరు కోసం ప్రత్యేకమైన వేపర్ ఛాంబర్ కూలింగ్ సిస్టమ్‌ను కూడా దీనికి జతచేసింది. ఫోల్డబుల్ ఫార్మ్ ఫ్యాక్టర్‌కు అనుగుణంగా ఊూ 27 ఆపరేటింగ్ సిస్టమ్‌ను రీ-డిజైన్ చేశారు. ఫోన్‌ను తెరవడం, మూయడం లేదా వేర్వేరు యాంగిల్స్‌లో ఉపయోగించినప్పుడు సాఫ్ట్‌వేర్ దానంతట అదే సర్దుబాటు అవుతుంది. “స్ప్లిట్ వ్యూ” ఫీచర్‌తో ఒకేసారి రెండు యాప్‌లను పక్కపక్కనే ఉపయోగించుకోవచ్చు.

భద్రత కోసం సైడ్-మౌంటెడ్ పవర్ బటన్‌లో టచ్ ఐడీని యాపిల్ తిరిగి ప్రవేశపెట్టింది. మన్నిక కోసం గ్రేడ్ 5 టైటానియం బాడీ, వెనుకవైపు సిరామిక్ షీల్డ్, ముందువైపు సిరామిక్ షీల్డ్ 2 ప్రొటెక్షన్ కల్పించారు. నీరు, ధూళి నుంచి రక్షణ కోసం దీనికి IP68 రేటింగ్ కూడా ఉంది.

కెమెరా విషయానికొస్తే, ఇందులో 48-మెగాపిక్సెల్ ఫ్యూజన్ మెయిన్ కెమెరా (2x టెలిఫోటో సామర్థ్యంతో), మ్యాక్రో ఫోటోగ్రఫీకి సపోర్ట్ చేసే 48-మెగాపిక్సెల్ అల్ట్రా వైడ్ కెమెరా ఉన్నాయి. మొత్తంగా, యాపిల్ నుంచి వచ్చిన ఈ వినూత్న ప్రీమియం ఉత్పత్తి మార్కెట్‌లో ఒక కొత్త ఒరవడిని సృష్టించనుంది.

# ప్రపంచానికి ‘ఏఐ వార్మ్’ల ముప్పు.. ముందే హెచ్చరిస్తున్న నిపుణులు!

**ఇంటర్నెట్‌కు పొంచి ఉన్న ‘ఏఐ వార్మ్’ అనే కొత్త ప్రమాదం**
**స్మార్ట్ టీవీ, ఫ్రిజ్ వంటి పరికరాలలో స్వయంగా వ్యాపించే సామర్థ్యం**
**ప్రముఖ ఏఐ సంస్థ ఆంత్రోపిక్ రెడ్ టీమ్ పరిశోధనలో కీలక విషయాల వెల్లడి**
**2026 చివరి నాటికి చిన్న ఏఐ మోడళ్లు ఈ సామర్థ్యాన్ని పొందవచ్చని అంచనా**
**ఐఓటీ పరికరాల భద్రతను బలోపేతం చేయాలని నిపుణుల సూచన**




టెక్నాలజీ ప్రపంచంలో సరికొత్త ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ‘ఏఐ వార్మ్’ పేరుతో పిలుస్తున్న ఈ ముప్పు గురించి ప్రముఖ ఏఐ సంస్థ ఆంత్రోపిక్ తన ఫ్రాంటియర్ రెడ్ టీమ్ పరిశోధనలో హెచ్చరించింది. డేటా సెంటర్లతో సంబంధం లేకుండా, ఇంటర్నెట్‌కు కనెక్ట్ అయిన సాధారణ గృహోపకరణాలలోకి చొరబడి, తమంతట తాముగా వ్యాపించగల సామర్థ్యం చిన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మోడళ్లకు త్వరలోనే రావచ్చని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఇది ఇంటర్నెట్ భద్రతకు పెను సవాలుగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

ఏమిటీ ఏఐ వార్మ్?

సాధారణంగా కంప్యూటర్ వైరస్‌లు కోడ్ రూపంలో ఒక పరికరం నుంచి మరొకదానికి వ్యాపిస్తాయి. కానీ, ఏఐ వార్మ్‌లు దీనికి భిన్నం. వీటిని ‘వెయిట్-బేస్డ్ రెప్లికేటర్లు’ అని పిలుస్తున్నారు. అంటే, ఇవి కేవలం కోడ్‌ను కాకుండా, తమ ఏఐ మోడల్ బరువు (షవఅస్త్రష్ట్రం) మొత్తాన్ని మోసుకెళతాయి. స్మార్ట్ టీవీలు, రిఫ్రిజిరేటర్లు, సెక్యూరిటీ కెమెరాలు, చౌకైన ఆండ్రాయిడ్ టీవీ బాక్సుల వంటి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) పరికరాలను లక్ష్యంగా చేసుకుని, వాటి హార్డ్‌వేర్‌పై తమను తాము ఇన్‌స్టాల్ చేసుకుంటాయి. అక్కడి నుంచి నెట్‌వర్క్‌లోని ఇతర పరికరాలకు వ్యాపిస్తాయి. వీటికి సెంట్రల్ కమాండ్ వ్యవస్థ ఉండదు కాబట్టి, ఒక్కసారి వ్యాపించడం మొదలుపెడితే వీటిని అరికట్టడం చాలా కష్టమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

పరిశోధనలో ఏం తేలింది?

ఈ ముప్పుపై ఆంత్రోపిక్ రెడ్ టీమ్ బృందం పలు ప్రయోగాలు నిర్వహించింది. గూగుల్‌కు చెందిన ‘జెమ్మా 4’ (26దీ పారామీటర్ల) మోడల్‌ను చౌకైన ఆండ్రాయిడ్ టీవీ బాక్సులపై విజయవంతంగా నడిపారు. అయితే, దాని వేగం చాలా నెమ్మదిగా (సెకనుకు 0.39 టోకెన్లు) ఉన్నట్లు గుర్తించారు. 30 బిలియన్ల కంటే తక్కువ పారామీటర్లు ఉన్న చిన్న ఏఐ మోడళ్లు ఇప్పటికే లక్ష్యాలను గుర్తించడం, యాక్సెస్ పొందడం, తమను తాము ఇన్‌స్టాల్ చేసుకోవడం వంటి పనులను విడివిడిగా చేయగలవని తేలింది. అయితే, ఈ ప్రక్రియలన్నింటినీ ఒకేసారి తప్పుల్లేకుండా పూర్తిచేసే సామర్థ్యం ప్రస్తుతానికి వాటికి లేదు. కానీ, ఏఐ మోడళ్ల అభివృద్ధి వేగాన్ని బట్టి చూస్తే, 2026 చివరి నాటికి ఈ సామర్థ్యాన్ని అవి అందుకోవచ్చని ఆంత్రోపిక్ అంచనా వేస్తోంది.

## ముందస్తు హెచ్చరిక మాత్రమే

ప్రస్తుతానికి ఇలాంటి ‘ఏఐ వార్మ్’లు వాస్తవ ప్రపంచంలో ఇంకా ఆవిర్భవించలేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పరిశోధనలో భాగంగా జరిపిన ప్రయోగాలు కూడా సులభతరం చేసిన నియంత్రిత వాతావరణంలో జరిగాయి. నిజ జీవితంలో వాటి వ్యాప్తి ఇంకా కష్టతరంగా ఉండొచ్చు. అయితే, ఈ పరిశోధనను ఒక ముందస్తు హెచ్చరికగా భావించాలని ఆంత్రోపిక్ సూచించింది. భవిష్యత్తులో ఈ ముప్పును ఎదుర్కోవడానికి వినియోగదారులు, ఐఓటీ పరికరాల తయారీదారులు భద్రతా ప్రమాణాలను కఠినతరం చేయాలని పిలుపునిచ్చింది. డిఫాల్ట్ సెట్టింగ్స్‌ను మెరుగుపరచడం, అనవసరమైన పోర్ట్‌లను మూసివేయడం వంటి చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది.

# వెబ్‌సైట్లలో Iμm Not a Robot ఎందుకు క్లిక్ చేయాలి? అసలు కారణం ఇదే!

**మనిషిని, బాట్‌ను వేరు చేసేందుకు ‘క్యాప్చా’తో ప్రయోజనం**
**నకిలీ అకౌంట్లు, స్పామ్‌ను తగ్గించడంలో సాయం**
**చిత్రాలను ఎంచుకోవడం కూడా క్యాప్చా పరీక్షలో భాగమే**
**ఆన్‌లైన్ అకౌంట్లకు అదనపు రక్షణ,**
**వీపీఎన్ వాడితే మళ్లీ వెరిఫికేషన్**
**పదేపదే తనిఖీలు రావడానికి అసాధారణ ట్రాఫిక్ కారణం**

ఇంటర్నెట్‌లో ఏదైనా వెబ్‌సైట్‌ను తెరిచి అకౌంట్‌లోకి లాగిన్ అయినప్పుడు లేదా ఆన్‌లైన్ ఫారం నింపేటప్పుడు ‘ఐయామ్ నాట్ ఏ రోబో’ అనే ఆప్షన్ కనిపిస్తుంటుంది. కొన్నిసార్లు వక్రీకరించిన అక్షరాలను గుర్తించాలి, మరికొన్నిసార్లు బస్సులు, సైకిళ్లు, ట్రాఫిక్ లైట్లు ఉన్న చిత్రాలను ఎంచుకోవాలి. ఈ ప్రక్రియను క్యాప్చా (జూూాుజనాూ) అంటారు. వెబ్‌సైట్‌ను ఉపయోగిస్తున్నది నిజమైన వ్యక్తా? ఆటోమేటిక్‌గా పనిచేసే బాట్‌నా? అన్నది గుర్తించేందుకు దీన్ని రూపొందించారు.



‘జూూాుజనాూ’ అంటే ‘కంప్లీట్‌లీ ఆటోమేటెడ్ పబ్లిక్ ట్యూరింగ్ టెస్ట్ టూ టెక్ కంప్యూటర్స్ అండ్ హ్యూమన్స్ ఎపార్ట్’. వెబ్‌సైట్లపై బాట్ల దాడులను తగ్గించడం దీని ప్రధాన ఉద్దేశం. హానికరమైన బాట్లు నకిలీ అకౌంట్లు సృష్టించడం, కామెంట్లలో స్పామ్ నింపడం, ఆన్‌లైన్ పోల్స్‌ను ప్రభావితం చేయడం, ఒకే ఫారాన్ని పదేపదే సమర్పించడం వంటి పనులు చేస్తుంటాయి. అలాగే దొంగిలించిన పాస్‌వర్డ్‌లతో అకౌంట్లలోకి ప్రవేశించేందుకు కూడా ప్రయత్నిస్తాయి. క్యాప్చా ద్వారా ఇలాంటి ఆటోమేటెడ్ కార్యకలాపాలను అడ్డుకోవడం కొంత సులభమవుతుంది.

అయితే, ‘ఐయామ్ నాట్ ఏ రోబో’పై క్లిక్ చేసిన ప్రతిసారీ వెబ్‌సైట్ వినియోగదారుడిని కేవలం ఆ ఒక్క చర్య ఆధారంగానే గుర్తించదు. కొన్ని వ్యవస్థలు బ్రౌజింగ్ తీరుతో పాటు ఇతర సంకేతాలను కూడా పరిశీలిస్తాయి. పదేపదే వెరిఫికేషన్ అడగడానికి ఇంటర్నెట్ కనెక్షన్ నుంచి అసాధారణ ట్రాఫిక్ రావడం, తక్కువ సమయంలో ఎక్కువ అభ్యర్థనలు పంపడం, వీపీఎన్ వాడటం లేదా బ్రౌజర్ సెట్టింగ్స్ కారణం కావచ్చు. అందుకే సరైన సమాధానం ఇచ్చినా కొన్నిసార్లు మళ్లీ క్యాప్చా పూర్తి చేయాల్సి వస్తుంది.

క్యాప్చా ఒక్కటే ఆన్‌లైన్ భద్రతకు పూర్తి రక్షణ కాదు. వెబ్‌సైట్లు పాస్‌వర్డ్ రక్షణ, అనుమానాస్పద కార్యకలాపాల గుర్తింపు, మల్టీ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ వంటి ఇతర భద్రతా చర్యలతో దీన్ని కలిపి ఉపయోగిస్తాయి. కొన్ని సందర్భాల్లో క్యాప్చా తనిఖీలు వినియోగదారులకు ఇబ్బందిగా అనిపించినా, నకిలీ కార్యకలాపాలను తగ్గించి వెబ్‌సైట్లు సజావుగా పనిచేసేందుకు ఇవి తోడ్పడతాయి.

# రోజుకు 18 నిమిషాలు చాలు.. బరువు తగ్గడానికి సరికొత్త జపనీస్ 3-3-3 వాకింగ్ ఫార్ములా!

**బరువు తగ్గడానికి జపనీస్ 3-3-3 వాకింగ్ ఫార్ములా**

**రోజుకు కేవలం 18 నిమిషాల ఇంటర్వెల్ వాకింగ్**

**ఏరోబిక్ సామర్థ్యం, రక్తపోటు నియంత్రణలో మెరుగుదల**

**అన్ని వయసుల వారికి అనువైన సులభమైన వ్యాయామం**

**ఆహార నియమాలతో పాటిస్తే ఉత్తమ ఫలితాలు**



బరువు తగ్గడానికి, ఫిట్‌గా ఉండటానికి గంటల తరబడి జిమ్‌లో కష్టపడాల్సిన అవసరం లేదంటున్నారు ఆరోగ్య నిపుణులు. జపాన్‌కు చెందిన ఒక సులభమైన వాకింగ్ టెక్నిక్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అదే 'జపనీస్ 3-3-3 ఫార్ములా' లేదా 'ఇంటర్వెల్ వాకింగ్ ట్రైనింగ్'. రోజుకు కేవలం 18 నిమిషాలు కేటాయించడం ద్వారా బరువును నియంత్రించుకోవడంతో పాటు శారీరక సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని ఈ పద్ధతి సూచిస్తోంది. దీనికి ప్రత్యేకమైన పరికరాలు గానీ, ఖరీదైన జిమ్ సభ్యత్వం గానీ అవసరం లేదు.

ఏమిటీ 3-3-3 ఫార్ములా?.. ఎలా చేయాలి?

ఈ వాకింగ్ టెక్నిక్ చాలా సులభం. దీని ప్రకారం మొదట మూడు నిమిషాల పాటు నెమ్మదిగా, సౌకర్యవంతమైన వేగంతో నడవాలి. ఆ తర్వాత వెంటనే, మరో మూడు నిమిషాల పాటు వీలైనంత వేగంగా నడవాలి. వేగంగా నడిచేటప్పుడు గుండె వేగం, శ్వాస పెరగాలి, కానీ చిన్న చిన్న వాక్యాలు మాట్లాడగలిగేలా ఉండాలి. ఇలా నెమ్మది, వేగవంతమైన నడకను ఒక సైకిల్‌గా పరిగణించి, దీనిని మూడుసార్లు పునరావృతం చేయాలి.

అంటే మొత్తం 18 నిమిషాల్లో ఈ వ్యాయామం పూర్తవుతుంది. మరింత మంచి ఫలితాల కోసం, వారానికి కనీసం నాలుగు రోజులు, ఈ సైకిల్‌ను ఐదుసార్లు (మొత్తం 30 నిమిషాలు) చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ వాకింగ్‌ను పార్కులో, ట్రెడ్‌మిల్‌పై లేదా ఇంట్లో ఉన్న కాస్త స్థలంలోనైనా చేయవచ్చు.

శాస్త్రీయ ఆధారాలు.. ప్రయోజనాలు

ఈ వాకింగ్ టెక్నిక్‌పై జపాన్‌లోని షిన్షు యూనివర్సిటీ పరిశోధకులు అధ్యయనాలు చేశారు. వారి పరిశోధనల ప్రకారం, సాధారణ వాకింగ్‌తో పోలిస్తే ఈ ఇంటర్వెల్ వాకింగ్ వల్ల ఎన్నో అదనపు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తేలింది. ముఖ్యంగా ఏరోబిక్ కెపాసిటీ (శరీరం ఆక్సిజన్‌ను వినియోగించుకునే సామర్థ్యం) పెరగడం, కాళ్ల కండరాలు బలోపేతం కావడం, అధిక రక్తపోటు నియంత్రణలోకి రావడం వంటి సానుకూల మార్పులను గమనించారు.

టైప్ 2 డయాబెటిస్ ఉన్న పెద్దలపై జరిపిన ఒక అధ్యయనంలో ఈ పద్ధతిని కొన్ని నెలల పాటు పాటించడం వల్ల శరీరంలోని కొవ్వు, ముఖ్యంగా అవయవాల చుట్టూ పేరుకుపోయే ప్రమాదకరమైన విసెరల్ ఫ్యాట్ తగ్గడంలో ఇది బాగా సహాయపడినట్లు వెల్లడైంది. అలాగే, రక్తంలో గ్లూకోజ్ స్థాయులను నియంత్రించడంలో కూడా మెరుగైన ఫలితాలు కనిపించాయి.

ఇది ఒక్కటే సరిపోతుందా?

అయితే, కేవలం ఈ ఒక్క వ్యాయామంతోనే అద్భుతాలు జరిగిపోతాయని భావించకూడదు. సాధారణ నడక కంటే ఈ పద్ధతిలో ఎక్కువ కేలరీలు ఖర్చవుతాయన్నది వాస్తవమే. కానీ, శాశ్వతంగా బరువు తగ్గాలంటే సరైన ఆహార నియమాలు పాటించడం అత్యంత కీలకమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

పోర్షన్ కంట్రోల్ (తినే ఆహారం పరిమాణంపై నియంత్రణ), క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, తగినంత నిద్ర, ఒత్తిడిని తగ్గించుకోవడం వంటివి కూడా ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఈ 3-3-3 ఫార్ములాను ఒక సంపూర్ణ పరిష్కారంగా కాకుండా, ఆరోగ్యకరమైన జీవనశైలికి ఒక చక్కని జోడింపుగా భావించాలి.

ఎలాంటి కఠినమైన శ్రమ లేకపోవడం వల్ల ఇది అన్ని వయసుల వారికి, వివిధ ఫిట్‌నెస్ స్థాయులలో ఉన్నవారికి అనుకూలంగా ఉంటుంది. కొత్తగా ప్రారంభించే వారు వేగవంతమైన నడక సమయాన్ని క్రమంగా పెంచుకుంటూ ఈ వ్యాయామాన్ని అలవాటు చేసుకోవచ్చు.

# యాంటీబయాటిక్స్ వాడే ముందు.. దగ్గు గురించి ఈ నిజాలు తెలుసుకోండి!

**దగ్గులో పొడి దగ్గు, కఫంతో కూడిన దగ్గు అని ప్రధానంగా రెండు రకాలు**

**గొంతులో చికాకుతో కఫం లేకుండా వస్తే అది పొడి దగ్గు**

**కఫం లేదా శ్లేష్మం ఉత్పత్తి అయితే అది కఫంతో కూడిన దగ్గు**

**మూడు వారాలకు మించి తగ్గకపోయినా, జ్వరం ఉన్నా వైద్యులను సంప్రదించాలి**

**వైద్యుడి సలహా లేకుండా సొంతంగా యాంటీబయాటిక్స్ వాడటం ప్రమాదకరం**



వాతావరణ మార్పులు, ఇన్ఫెక్షన్ల కారణంగా చాలామందిని వేధించే సాధారణ సమస్య.. దగ్గు. అయితే, వచ్చే దగ్గులన్నీ ఒకే రకంగా ఉండవు. దగ్గును దాని లక్షణాలను బట్టి ప్రధానంగా పొడి దగ్గు (ఱతీఎ జశీబస్త్రష్ట), కఫంతో కూడిన దగ్గు (ఔవ్ జశీబస్త్రష్ట) అని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. ఈ రెండింటి మధ్య తేడాలను అర్థం చేసుకోవడం ద్వారా సరైన జాగ్రత్తలు తీసుకోవడానికి, అవసరమైతే వైద్యులను సంప్రదించడానికి వీలవుతుంది.

పొడి దగ్గు లక్షణాలు ఎలా ఉంటాయి?

పొడి దగ్గులో కఫం లేదా శ్లేష్మం ఉత్పత్తి కాదు. ఇది ప్రధానంగా గొంతులో చికాకు, దురద లేదా గరగర వంటి అనుభూతిని కలిగిస్తుంది. దుమ్ము, పొగ, కాలుష్యం, అలర్జీలు లేదా కొన్ని వైరల్ ఇన్ఫెక్షన్ల కారణంగా ఇది అకస్మాత్తుగా ప్రారంభమవుతుంది. ముఖ్యంగా రాత్రిపూట దీని తీవ్రత ఎక్కువగా ఉంటుంది. తరచుగా దగ్గడం వల్ల గొంతు నొప్పి కూడా రావచ్చు. దీనికి ప్రధాన కారణం శ్వాసనాళాల్లోని వాపు లేదా చికాకే కానీ, శ్లేష్మం చేరడం కాదు.

కఫంతో కూడిన దగ్గు అంటే ఏమిటి?

దీన్నే ఉత్పాదక దగ్గు అని కూడా అంటారు. ఈ రకం దగ్గు వచ్చినప్పుడు శ్వాసనాళాలు లేదా ఊపిరితిత్తులలో పేరుకుపోయిన కఫం లేదా శ్లేష్మం బయటకు వస్తుంది. జలుబు, ఫ్లూ, బ్రాంకైటిస్ వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల సమయంలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. కఫం పేరుకుపోవడం వల్ల ఛాతీలో బరువుగా లేదా పట్టేసినట్లు అనిపించడం దీని ముఖ్య లక్షణం. శరీరంలోని ఇన్ఫెక్షన్‌ను, శ్లేష్మాన్ని బయటకు పంపేందుకు శరీరం చేసే ప్రయత్నంలో భాగంగా ఈ దగ్గు వస్తుంది.

వైద్యులను ఎప్పుడు సంప్రదించాలి?

సాధారణంగా దగ్గు కొద్ది రోజుల్లో తగ్గిపోతుంది. కానీ, కొన్ని సందర్భాల్లో దాన్ని నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరం. కింది లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిది.

దగ్గు మూడు వారాలకు మించి తగ్గకుండా కొనసాగితే.

దగ్గుతో పాటు తీవ్రమైన జ్వరం, ఛాతీ నొప్పి లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే.

దగ్గినప్పుడు వచ్చే కఫంలో రక్తం కనిపిస్తే.

దగ్గు తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నా లేదా చికిత్స తీసుకున్నా తగ్గకపోయినా.

ముఖ్య గమనిక: సొంత వైద్యం ప్రమాదకరం

చాలామంది కఫంతో దగ్గు వస్తే అది బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ అని భావించి, వైద్యుడి సలహా లేకుండా యాంటీబయాటిక్స్ వాడేస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రతి కఫంతో కూడిన దగ్గు బ్యాక్టీరియా వల్లనే రాదు. వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల కూడా రావచ్చు. అనవసరంగా యాంటీబయాటిక్స్ వాడటం వల్ల శరీరంలో ప్రతికూల నిరోధకత (ూాత్ఱఅఎఱశీఱఅ =వంఱర్ఝఅఎవ) పెరిగి, భవిష్యత్తులో నిజంగా అవసరమైనప్పుడు అవి పనిచేయకుండా పోయే ప్రమాదం ఉంది. కాబట్టి, దగ్గు లక్షణాలను బట్టి సొంతంగా నిర్ణయాలు తీసుకోకుండా, వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకే మందులు వాడటం ఉత్తమం.

# ఫోన్ ఎక్కువగా చూస్తున్నారా? మెడనొప్పి వస్తోందా?.. అయితే ఇది 'టెక్స్ట్ నెక్' కావచ్చు!

**స్మార్ట్‌ఫోన్ల మితిమీరిన వాడకంతో 'టెక్స్ట్ నెక్ సింద్రోమ్' కేసులు పెరుగుతున్నాయన్న నిపుణులు**

**ఫోన్ చూసేందుకు తల వంచితే మెడపై దాదాపు 22 కిలోల సమానమైన భారం పడుతుందని వెల్లడి**

**మెడనొప్పి, చేతుల్లో తిమ్మిర్లు, తలనొప్పి వంటివి ఈ సమస్య ప్రధాన లక్షణాలు**

**ప్రతి 20 నిమిషాలకు విరామం తీసుకుని, పరికరాలను కంటి స్థాయిలో ఉంచి వాడటం ముఖ్యం**

**నొప్పి తీవ్రంగా ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం మంచిదని సలహా**



నేడు ప్రపంచ 'స్పైన్ డే'. ఆధునిక జీవనశైలి కారణంగా వెన్నెముక ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ఈ రోజును ప్రత్యేకంగా పాటిస్తారు. అయితే, మారుతున్న కాలంతో పాటు కొత్త ఆరోగ్య సమస్యలూ పుట్టుకొస్తున్నాయి. అందులో ముఖ్యమైనదే 'టెక్స్ట్ నెక్ సింద్రోమ్'. స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్‌ల వంటి డిజిటల్ స్క్రీన్లను గంటల తరబడి చూడటం వల్ల ఈ సమస్య తీవ్రంగా విస్తరిస్తోందని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎందుకింత ప్రమాదకరం?

సాధారణంగా నిటారుగా ఉన్నప్పుడు మన తల బరువు సుమారు 4.5 నుంచి 5 కిలోల వరకు ఉంటుంది. కానీ, మనం స్మార్ట్‌ఫోన్ చూడటానికి తలను ముందుకు వంచినప్పుడు, మెడలోని వెన్నుపూసలపై (సెర్వికల్ స్పైన్) పడే ఒత్తిడి ఏకంగా 22 కిలోల బరువుకు సమానంగా పెరుగుతుంది. ఈ అదనపు భారం మెడ కండరాలపై తీవ్రమైన ఒత్తిడిని కలిగిస్తుంది. ఇది చాలా కాలం కొనసాగితే మెడలోని సహజమైన వంపు దెబ్బతినడం, వెన్నుపూసల మధ్య ఉండే డిస్కులు అరిగిపోవడం, నరాలు నొక్కుకుపోవడం వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది.

ప్రధాన లక్షణాలు ఇవే..

ప్రారంభంలో మెడనొప్పి, మెడ కండరాలు బిగుసుకుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలామంది దీనిని సాధారణ నొప్పే కదా అని నిర్లక్ష్యం చేస్తారు. కానీ, సమస్య ముదిరితే భుజాలు, చేతులు, వేళ్లలోకి తిమ్మిర్లు పాకడం, తల వెనుక భాగంలో తీవ్రమైన తలనొప్పి, కళ్లు తిరగడం, మెడను స్వేచ్ఛగా కదిలించలేకపోవడం, భుజాలు త్వరగా అలసిపోవడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయి.

నివారణ మార్గాలు

కొన్ని సాధారణ జాగ్రత్తలు పాటించడం ద్వారా 'టెక్స్ట్ నెక్ సింద్రోమ్' బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు.

ఫోన్ లేదా ఇతర పరికరాలను కంటికి సమానమైన స్థాయిలో (వఎవ శ్రీవజవశ్రీ) ఉంచి వాడాలి.

ప్రతి 20-30 నిమిషాలకు ఒకసారి విరామం తీసుకుని, మెడకు చిన్నపాటి వ్యాయామాలు చేయాలి. గడ్డాన్ని ఛాతీకి ఆనించడం (చిన్ టక్స్), మెడను నెమ్మదిగా గుండ్రంగా తిప్పడం వంటివి మేలు చేస్తాయి.

కుర్చీలో కూర్చున్నప్పుడు వెన్నెముకకు సపోర్ట్ ఉండేలా నిటారుగా కూర్చోవాలి.

పనిచేసే చోట ఎర్గోనామిక్ కుర్చీలు, ల్యాప్‌టాప్ స్టాండ్‌లు వాడటం వల్ల మెడపై ఒత్తిడి తగ్గుతుంది.

ఒకవేళ మెడనొప్పి దీర్ఘకాలంగా వేధిస్తున్నా, తిమ్మిర్లు చేతులకు పాకుతున్నా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. తొలిదశలోనే సరైన చికిత్స తీసుకుంటే వెన్నెముక ఆరోగ్యాన్ని దీర్ఘకాలం పాటు కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

### అరగంట కఠిన వ్యాయామం చేసినా క్యాన్సర్ ముప్పు..

# రోజంతా కూర్చునేవారికి వైద్యుల హెచ్చరిక



రోజూ అరగంట వ్యాయామం చేస్తున్నారు.. మిగతా సమయమంతా ఆఫీసులో కుర్చీకి, ఇంట్లో సోఫాకు అతుక్కుపోతున్నారా? అయితే మీ ఆరోగ్యంపై మరోసారి దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోజూ వ్యాయామం చేయడం మంచిదే అయినా, రోజులో ఎక్కువ గంటలు కదలకుండా కూర్చోవడం వల్ల కలిగే ప్రమాదాలను అది పూర్తిగా తొలగించలేదని చెబుతున్నారు. శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు కలిసి జీవక్రియల్లో మార్పులకు దారితీయడంతో పాటు కొన్ని రకాల క్యాన్సర్ల ముప్పును పెంచవచ్చని వివరిస్తున్నారు.

ఎక్కువసేపు కదలకుండా ఉండటం వల్ల కండరాల బలం తగ్గడం, శరీర భంగిమ దెబ్బతినడం, రక్తంలో చక్కెర స్థాయుల నియంత్రణలో ఇబ్బందులు తలెత్తవచ్చని డాక్టర్లు తెలిపారు.

అధిక బరువుతో క్యాన్సర్ ముప్పు ఎలా?

శరీరంలో కొవ్వు కేవలం శక్తిని నిల్వ చేయడానికే పరిమితం కాదు. అది హార్మోన్లపై ప్రభావం చూపడంతో పాటు శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ సంబంధిత ప్రక్రియలను ప్రేరేపించవచ్చు. అధిక కొవ్వు వల్ల ఇన్సులిన్ నిరోధకత పెరిగి, కణాల పెరుగుదలను ప్రభావితం చేసే మార్పులు చోటుచేసుకోవచ్చు. మెనోపాజ్ తర్వాత అధిక కొవ్వు కణజాలం నుంచి ఈస్ట్రోజెన్ ఎక్కువగా ఉత్పత్తి కావడం కూడా రొమ్ము, గర్భాశయ అంతర్గత పొర క్యాన్సర్ల ముప్పుతో సంబంధం కలిగి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

అధిక శరీర బరువుకు కనీసం 13 రకాల క్యాన్సర్లతో సంబంధం ఉన్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. వీటిలో పెద్దపేగు, మూత్రపిండాలు, కాలేయం, క్లోమం, అండాశయాలు, థైరాయిడ్, రొమ్ము క్యాన్సర్లు ఉన్నాయి. అయితే అధిక బరువు ఉన్న ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ వస్తుందని దీని అర్థం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

రోజంతా కదలిక ఉండాలి

పెద్దలకు వారానికి 150-300 నిమిషాల మితమైన వ్యాయామం లేదా 75-150 నిమిషాల తీవ్ర వ్యాయామం ఉపయోగకరమని వైద్యులు సూచిస్తున్నారు. వేగంగా నడవడం, సైక్లింగ్, ఈత వంటి కార్యకలాపాలు ఇందులో భాగం కావచ్చు. అయితే వ్యాయామ సమయంతో పాటు రోజంతా కదలికను కొనసాగించడం కూడా ముఖ్యమే. ఎక్కువసేపు కూర్చొని పనిచేసేవారు మధ్యమధ్యలో లేచి నడవాలి. ఫోన్‌లో మాట్లాడేటప్పుడు నిలబడటం, వీలైతే మెట్లు ఎక్కడం, పని మధ్యలో సాగదీత వ్యాయామాలు చేయడం అలవాటు చేసుకోవాలి. గంటల తరబడి ఒకే చోట కూర్చోకుండా చిన్న విరామాలు తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

పొగాకు వాడకాన్ని నివారించడం, మద్యానికి దూరంగా ఉండటం, పోషకాహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన బరువును కొనసాగించడం, వయసు, వ్యక్తిగత ముప్పును బట్టి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవడం కూడా నివారణలో భాగమే. ఒక్క అలవాటుతో క్యాన్సర్‌ను పూర్తిగా నివారించలేమని, అయితే రోజువారీ జీవనశైలిలో చిన్న మార్పులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని వైద్యులు చెబుతున్నారు.

# రష్మిక 100 సార్లు అడిగితేనే పెళ్లి చేసుకున్నా!: విజయ్ దేవరకొండ

**'కాఫీ విత్ కరణ్' షోలో సందడి చేసిన విజయ్-రష్మిక జంట**

**రష్మిక ఏడాది పాటు వెంటపడితే ఒకే చెప్పానన్న విజయ్**

**సంతోషకరమైన వివాహానికి తన మంత్రం చెప్పిన విజయ్**

**షో మధ్యలో అల్లు అర్జున్‌కు ఫోన్ చేసిన విజయ్ దేవరకొండ**



టాలీవుడ్ క్యూట్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పెళ్లి తర్వాత తొలిసారిగా కలిసి ప్రముఖ చాట్ షో 'కాఫీ విత్ కరణ్'లో సందడి చేశారు. ఈ ఫైనల్ సీజన్ రెండో ఎపిసోడ్‌లో పాల్గొన్న ఈ జంట, తమ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఎన్నో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా తమ పెళ్లి ప్రపోజల్ వెనుక ఉన్న అసలు కథను వివరించి అందరినీ ఆశ్చర్యపరిచారు.

షోలో హోస్ట్ కరణ్ జోహార్ 'మీకు ప్రపోజల్ ఎలా జరిగింది?' అని అడగ్గా, రష్మిక సిగ్గుతో తలదించుకుంది. దీనిపై విజయ్ దేవరకొండ స్పందిస్తూ, "మనం పెళ్లి చేసుకుందాం అని తనే నన్ను అడిగింది. నేను ఒకే చెప్పేలోపు సుమారు 100 సార్లు అడిగి ఉంటుంది" అని నవ్వుతూ చెప్పారు. విజయ్ మాటలకు కరణ్ ఆశ్చర్యపోగా, రష్మిక కలుగజేసుకుని "నేను ఏడాది పాటు అడుగుతూనే ఉన్నాను" అని అసలు విషయం బయటపెట్టారు. దానికి విజయ్ సరదాగా "నేనేం అంత చెడ్డవాడిని కాదు" అని చెప్పడంతో సెట్‌లో నవ్వులు పూశాయి.

ఇదే షోలో రాపిడ్ ఫైర్ సెక్షన్‌లో, 'పుష్ప' సహనటుడు అల్లు అర్జున్, 'యానిమల్' సహనటుడు రణ్‌బీర్ కపూర్‌లలో ఎవరిని ఎంచుకుంటారని కరణ్ అడగ్గా, రష్మిక వెంటనే అల్లు అర్జున్ పేరు చెప్పారు. అలాగే, రష్మిక కాకుండా ఎవరితో ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ బాగుంటుందని విజయ్‌ను ప్రశ్నించగా, రష్మిక వెంటనే 'ఎవరితోనూ లేదు' అని జవాబిచ్చింది. దీనిపై విజయ్ స్పందిస్తూ, "సంతోషకరమైన వివాహానికి నా మంత్రం ఒక్కటే.. భార్య చెప్పిన దానికి ఎప్పుడూ ఒకే అనాలి" అని చమత్కరించారు.

షోలోని గేమింగ్ సెగ్మెంట్‌లో విజయ్.. అల్లు అర్జున్‌కు ఫోన్ చేసి కరణ్ తో మాట్లాడించడం మరో విశేషం. కొంతకాలంగా తమ రిలేషన్‌షిప్‌పై వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ, విజయ్-రష్మిక ఈ ఏడాది ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్‌లోని ఐటీసీ మెమెంటోస్‌లో సంప్రదాయబద్ధంగా వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే.

# 3 రోజుల్లో రూ.300 కోట్లు.. బాక్సాఫీసు వద్ద 'జైలర్-2' మేనియా

**తొలి వారాంతంలోనే రెండుసార్లు వంద కోట్ల మార్కును అందుకున్న వసూళ్లు**

**విదేశాల్లో మూడు రోజుల్లోనే రూ. 155 కోట్ల భారీ గ్రాస్ కలెక్షన్స్**

**నాలుగు రోజుల వీకెండ్‌కు రూ. 420 కోట్లకు పైగా రాబట్టే అవకాశం**

**హిందీలోనూ భారీ మల్టీప్లెక్స్‌లు లేకుండానే మంచి వసూళ్లు**



సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి బాక్సాఫీస్ వద్ద తన స్టామినా ఏంటో నిరూపిస్తున్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'జైలర్ 2' చిత్రం విడుదలైన కేవలం మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ట్రేడ్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం, ఈ సినిమా తొలి మూడు రోజుల్లోనే రూ. 300 కోట్ల మైలురాయిని దాటి సరికొత్త రికార్డులు నెలకొల్పింది.

విడుదలైన మొదటి రోజు నుంచే 'జైలర్ 2' హవా స్పష్టంగా కనిపించింది. తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ. 125 కోట్ల గ్రాస్ వసూలు చేసిన ఈ చిత్రం, రెండో రోజు రూ. 85 కోట్లు రాబట్టింది. ఇక మూడో రోజు శనివారం నాడు వసూళ్లు మళ్లీ పుంజుకొని ఏకంగా రూ. 108 కోట్లకు చేరాయి. దీంతో మూడు రోజుల్లో మొత్తం గ్రాస్ రూ. 318 కోట్లకు చేరినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. తొలి వారాంతంలోనే రెండుసార్లు ఒకే రోజులో రూ. 100 కోట్లకు పైగా గ్రాస్ సాధించడం రజనీకాంత్ సినిమాకే చెల్లిందని విశ్లేషకులు చెబుతున్నారు.

భారత్‌లోనే కాకుండా ఓవర్సీస్‌లోనూ 'జైలర్ 2' అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతోంది. ప్రీమియర్‌లతో కలిపి కేవలం మూడు రోజుల్లోనే విదేశీ మార్కెట్ల నుంచి ఈ సినిమా రూ. 155 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇది భారతీయ సినిమాకు అపూర్వమైన విజయంగా పరిగణిస్తున్నారు.

ప్రస్తుత ట్రెండ్ చూస్తుంటే, ఆదివారం కూడా ఈ చిత్రం రూ. 100 కోట్ల మార్కును దాటే అవకాశం ఉందని, దీంతో నాలుగు రోజుల లాంగ్ వీకెండ్ ముగిసేసరికి ప్రపంచవ్యాప్తంగా మొత్తం వసూళ్లు రూ. 420 కోట్లు దాటవచ్చని అంచనా వేస్తున్నారు. హిందీ బెల్ట్‌లోనూ పీవీఆర్ ఐనాక్స్, సినీపోలిస్, మిరాజ్ వంటి ప్రధాన మల్టీప్లెక్స్ చైన్‌లలో విడుదల కానప్పటికీ, మూడు రోజుల్లో రూ. 10.50 కోట్ల నెట్ వసూళ్లు సాధించడం విశేషం. ఈ గణాంకాలు చూస్తుంటే, 'జైలర్ 2' మెగా బ్లాక్‌బస్టర్‌గా నిలవడం ఖాయమని స్పష్టమవుతోంది.

# 'డీసీ' (సోనీ లివ్) మూవీ రివ్యూ!



ఒక స్టార్ హీరోకి ఎంతటి క్రేజ్ ఉంటుందో, దర్శకుడిగా అంతటి క్రేజ్ ను సంపాదించుకున్నారు లోకేశ్ కనగరాజ్. ఆయన కథానాయకుడిగా రూపొందిన తొలి సినిమానే 'డీసీ'. గతంలో 'సానికాయుధం' వంటి విభిన్నమైన చిత్రాన్ని అందించిన దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ తెరకెక్కించిన సినిమా ఇది. ఆగస్టు 7వ తేదీన ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేశారు. 100 కోట్లకి పైగా వసూళ్లను రాబట్టిన ఈ సినిమా, ఈ నెల 16వ తేదీ నుంచి ఐదు భాషల్లో 'సోనీ లివ్'లో స్ట్రీమింగ్ అవుతోంది.

దేవదాస్ (లోకేశ్ కనగరాజ్) సెబాస్టియన్ .. కిట్టూ .. నరసింహన్ .. నేరస్థులు. జైలు శిక్షను అనుభవిస్తున్న సమయంలోనే వీళ్లందరి మధ్య స్నేహం ఏర్పడుతుంది. బయటికి వచ్చిన తరువాత ఒక గ్యాంగ్ గా ఏర్పడి దొంగతనాలు చేస్తుంటారు. ఆ క్రమంలోనే ప్రభుత్వానికి సంబంధించిన ఆయుధాలు తరలించబడుతూ ఉండగా దారి కాసి కొట్టేస్తారు. ఆ సమయంలోనే వీళ్ల చేతిలో ఒక పోలీస్ ఆఫీసర్ చనిపోతాడు. దాంతో దాస్ గ్యాంగ్ పై పోలీస్ గట్టి నిఘా పెడుతుంది. ఆ ప్రదేశంలో ఒక చెక్ పోస్ట్ ను ఏర్పాటు చేస్తుంది.

ఒక రైతు తన కొడుకును పట్నంలో చదివించడం కోసం పొలం అమ్మేస్తాడు. అలా వచ్చిన 7 లక్షల రూపాయలతో ఆ ప్రదేశం మీదుగా వెళుతుంటాడు. అక్కడ కాపలాగా ఉన్న పోలీసులు ఆ రైతు దగ్గర డబ్బును నొక్కేసి అతనిని చంపేస్తారు. ఈ విషయాన్ని అతని భార్య పైఅధికారులకు ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించినా ఎవరూ పట్టించుకోరు. దాంతో ఆమె ఈ విషయాన్ని దాస్ తో చెప్పి కన్నీళ్లు పెట్టుకుంటుంది. ఆ రైతు డబ్బులను పోలీసుల దగ్గర నుంచి తీసుకుని ఆమె కి ఇచ్చేయాలని దాస్ భావిస్తాడు.

ఒక హోటల్లో పాటలు పాడే పార్వతి ( సంజనా కృష్ణమూర్తి)తో దాస్ ప్రేమలో పడతాడు. ఆమెను పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. అయితే పోలీసులకు .. దాస్ కి కాల్పులు జరుగుతున్న సమయంలో ఆమె చనిపోతుంది. అక్కడి నుంచి తప్పించుకున్న దాస్ కి చంద్ర (వామికా గబ్బి) పరిచయమవుతుంది. ఆమె గతం తెలుసుకున్న దాస్ ఆమెను అక్కడి నుంచి బయటికి తీసుకురావాలనుకుంటాడు. డబ్బు కోసం దాస్ తిరుగుతున్నాడని తెలుసుకున్న ఆమె, అతనికి డబ్బు సర్దుబాటు చేయాలనుకుంటుంది.

అసలు దాస్ గతం ఏమిటి? అతను ఎందుకు జైలుకు వెళతాడు? చంద్ర ఎలాంటి పరిస్థితులలో వేశ్యగా మారుతుంది? ఆమె కారణంగా దాస్ జీవితం ఎలాంటి మలుపు తిరుగుతుంది? రైతు కోల్పోయిన డబ్బును తిరిగి అతని భార్యకి చేర్చడం కోసం దాస్ ఎలాంటి ప్రమాదాలను ఎదుర్కోవలసి వస్తుంది? అనేది మిగతా కథ.

ప్రతి హంతకుడి వెనుక అతను అలా మారడానికి ఒక బలమైన కారణం కనిపిస్తుంది. అలాగే ప్రతి వేశ్య వెనుక ఒక కన్నీటి కథ వినిపిస్తుంది. అలాంటి ఒక హంతకుడు .. ఒక వేశ్య చుట్టూ దర్శకుడు ఈ కథను అల్లుకున్నాడు. ఎలాంటి పరిస్థితులలో ఈ ఇద్దరూ కలుసుకున్నారు .. ఇద్దరూ కలుసుకున్న తరువాత వాళ్లకి ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి .. వాటిని వాళ్లు ఎలా అధిగమిస్తారు .. అనే అంశాలు ఈ కథలో చోటుచేసుకుంటాయి.

సాధారణంగా హంతకుడినిగానీ .. వేశ్యను గాని సానుభూతి కోణంలో అర్థం చేసుకోవడానికి ఎవరూ ప్రయత్నించరు. ఆవేశంలో తొందరపడి హత్య చేసి ఉంటారు .. కష్టపడి పనిచేయడం ఇష్టం లేనివారు వేశ్యగా మారతారని అనుకుంటారు. అయితే ఈ కథలో ఇద్దరు పాత్రలకు సంబంధించిన వ్యక్తిత్వాలను డిజైన్ చేసిన తీరు ఆకట్టుకుంటుంది. మానవీయ కోణంలో ప్రేక్షకులు ఆ పాత్రలను గురించిన ఆలోచన చేసేలా ఉంటాయి.

నమ్మినవారి కోసం చివరివరకూ నిలబడటం అనేది దాస్ పాత్ర వైపు నుంచి కనిపిస్తే, అలా తన కోసం నిలబడినవారిని కడవరకూ కాపాడుకోవడమనేది చంద్ర పాత్ర వైపు నుంచి కనిపిస్తుంది. పరిస్థితులు తప్పు చేయించినా .. తప్పుడు మార్గంలో నడిపించినా మానవత్వాన్ని మరిచిపోకపోవడం ఈ పాత్రల గొప్పతనంగా కనిపిస్తుంది. తుపాకులు .. కత్తులు ఆత్మరక్షణకు మాత్రమే ఉపయోగపడతాయి. స్నేహం - ప్రేమ మాత్రమే ఆత్మ సంతృప్తిని ఇవ్వగలుగుతాయని నిరూపించిన సినిమా ఇది.

దాస్ గ్యాంగ్ ఆయుధాలను కాజేయడం .. డబ్బు కోసం రైతును పోలీసులే హత్య చేయడం వంటి ఆరంభ సన్నివేశాలు ఆడియన్స్ లో ఆసక్తిని రేకెత్తిస్తాయి. ఆ తరువాత సన్నివేశాలు కాస్త రొటీన్ గా అనిపించినప్పటికీ, ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ దగ్గరికి వచ్చేసరికి కథా బలం పెరుగుతూ వెళుతుంది. యాక్షన్ వెనకున్న బలమైన ఎమోషన్ కనెక్ట్ అవుతూ వస్తుంది. ఓ హంతకుడు .. ఓ వేశ్య .. ఓ అమాయకుడైన రైతు .. పోలీస్ డిపార్ట్ మెంట్ .. ఈ నాలుగు ట్రాకులను కలుపుతూ ఈ కథను నడిపించిన తీరు మెప్పిస్తుంది.

హీరోగా ఇది మొదటి సినిమానే అయినప్పటికీ లోకేశ్ కనగరాజ్ బాగా చేశాడు. ఇక సంజనా కృష్ణమూర్తి చాలా అందంగా .. ఆకర్షణీయంగా కనిపిస్తుంది. వామికా గబ్బి ఎప్పటిలానే తన నటనతో ఆకట్టుకుంటుంది. కళానిధి మారన్ నిర్మాణ విలువలు బాగున్నాయి. ముఖేశ్ ఫొటోగ్రఫీ .. అనిరుధ్ నేపథ్య సంగీతం .. ప్రసన్న ఎడిటింగ్ ఫరవాలేదు.

'కాలం అనేక పరీక్షలతో నిన్ను చాలా కఠినంగా మార్చవచ్చు. కానీ అవతలివారిని ఆదుకోవడం .. సాయపడటం మాత్రం మరిచిపోకు. ఎందుకంటే నువ్వు మనిషివనే విషయాన్ని గుర్తుచేసేవి అవే' అనే సందేశాన్ని ఇచ్చిన సినిమా ఇది. యాక్షన్ సినిమాలను ఇష్టపడేవారు ఈ సినిమాను చూడొచ్చు.

# చిన్నప్పుడు నన్ను అక్షయ్ ఖన్నా ఏడిపించాడు: కరణ్ జోహార్

**బ్యాడ్మింటన్ కోర్టు నుంచి బలహీనమైన ఆటగాళ్లను పంపించేవాడని వ్యాఖ్య**

**ఈ సంఘటన తన మనసులో గాయం చేసిందన్న కరణ్**

**కరణ్ షోలోనే ఈ ఘటనపై అక్షయ్ ఖన్నా క్షమాపణ**

బాలీవుడ్ ప్రముఖ ఫిల్మ్‌మేకర్ కరణ్ జోహార్, నటుడు అక్షయ్ ఖన్నా మధ్య చిన్ననాటి నుంచే పరిచయం ఉంది. అయితే, తన చిన్నతనంలో అక్షయ్ ఖన్నా తనను బాగా ఏడిపించేవాడని కరణ్ జోహార్ గతంలో ఒకసారి వెల్లడించారు. ఈ ఆసక్తికర సంఘటనను ఆయన తన 'కాఫీ విత్ కరణ్' షోలోనే పంచుకున్నారు.



2007లో ప్రసారమైన ఒక ఎపిసోడ్‌కు అక్షయ్ ఖన్నా, అనిల్ కపూర్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కరణ్ ఒక పాత జ్ఞాపకాన్ని గుర్తుచేసుకున్నారు. "మేమిద్దరం చిన్నప్పుడు సౌత్ బొంబాయిలో పక్కింటివాళ్లం. నేను చాలా పేలవంగా బ్యాడ్మింటన్ ఆడేవాడిని. కానీ అక్షయ్ అద్భుతంగా ఆడేవాడు. అతను కోర్టులోకి వచ్చి, సరిగా ఆడని నాతో పాటు మరికొందరిని 'నువ్వు, నువ్వు... కోర్టు నుంచి బయటకు వెళ్ళండి' అని గట్టిగా చెప్పేవాడు. మేం మౌనంగా వెళ్లిపోయేవాళ్లం. ఆ సంఘటన నా మనసులో బలంగా ముద్రపడిపోయింది" అని కరణ్ వివరించారు.

మొదట అక్షయ్ ఈ విషయాన్ని సరదాగా కొట్టిపారేస్తూ, కరణ్ కల్పించి చెబుతున్నాడని అన్నారు. అయితే, కరణ్ నిజమేనని చెప్పడంతో చివరికి అక్షయ్ ఆ సంఘటనపై క్షమాపణలు తెలిపారు. ఆసక్తికరంగా, అక్షయ్ ఖన్నా ఇప్పటివరకు కరణ్ దర్శకత్వంలో నటించనప్పటికీ, 2017లో కరణ్ నిర్మాణ సంస్థ 'ధర్మ ప్రొడక్షన్స్' నిర్మించిన 'ఇత్తెఫాక్' చిత్రంలో ఆయన హీరోగా నటించారు.

## ఆసక్తిగా ఎదురుచూస్తున్నా: 'రామాయణం' టీమ్‌కు రాజమౌళి ప్రశంసలు

ప్రఖ్యాత దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న పౌరాణిక చిత్రం 'రామాయణం పార్ట్-1'పై ప్రశంసలు కురిపించారు. ఈ చిత్ర దర్శకుడు నితీశ్ తివారీతో పాటు చిత్రబృందాన్ని అభినందిస్తూ ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఏడాది నవంబర్ 5న విడుదల కానున్న ఈ సినిమా కోసం తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు.సామాజిక మాధ్యమాల వేదికగా రాజమౌళి స్పందిస్తూ, "ప్రతి భారతీయ కథకుడు చెప్పాలని కలలుగనే మహత్తర గాథ రామాయణం. నితీశ్ తివారీ, నమిత్ మల్హోత్రా ఇంతటి భారీ స్థాయిలో ఈ ఇతిహాసాన్ని వెండితెరపైకి తీసుకురావడం అభినందనీయం. ప్రధాన నటీనటులందరూ తమ పాత్రలకు ప్రాణం పోశారు. నవంబర్ 5 కోసం నేను ఆత్రుతగా వేచి చూస్తున్నాను. చిత్ర బృందానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. ఇంతటి భారీ వ్యయంతో ఒక భారతీయ సినిమా రూపుదిద్దుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. గతంలో రామాయణ, మహాభారత ఘట్టాలను వెండితెరపై ఆవిష్కరించడం గురించి రాజమౌళి పలు సందర్భాల్లో తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఆ ఇతిహాసాలను గతంలో తెరపై చూపిన విధానం పట్ల తాను ఎప్పుడూ పూర్తిస్థాయిలో సంతృప్తి చెందలేదని ఓ అంతర్జాతీయ ఇంటర్వ్యూలో వెల్లడించారు. భవిష్యత్తులో తనదైన శైలిలో ఆ గాథలను దృశ్యరూపంలోకి తీసుకురావాలనే ఆకాంక్షను కూడా ఆయన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు 'రామాయణం' చిత్రంపై ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.నితీశ్ తివారీ, శ్రీధర్ రాఘవన్ సంయుక్తంగా రచన చేసిన ఈ సినిమాలో భారీ తారాగణం నటిస్తోంది శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతాదేవిగా సాయి పల్లవి, రావణుడిగా 'కేజీఎఫ్' ఫేమ్ యశ్ నటిస్తున్నారు. హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే, కైకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఆస్కార్ విజేతలు హాన్స్ జిమ్మర్, ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటం విశేషం.

# ఒక్క పరుగుకే గిల్ ను వెనక్కివంపిన ఛత్తీస్‌గఢ్ బౌలర్

**రంజీ ట్రోఫీలో పునరాగమనం చేసిన శుభ్‌మన్ గిల్ ఘోరంగా విఫలం**
**ఛత్తీస్‌గఢ్‌తో మ్యాచ్‌లో కేవలం ఒక్క పరుగుకే క్లీన్ బౌల్డ్**
**లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అజయ్ మండల్ బౌలింగ్‌లో వికెట్ సమర్పించుకున్న గిల్**
**న్యూజిలాండ్ పర్యటనకు ప్రాక్టీస్ కోసం రంజీల్లో ఆడుతున్న భారత కెప్టెన్**
**మరోవైపు, బెంగాల్ జట్టుకు సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ దూరం**

టీమిండియా టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు రంజీ ట్రోఫీ రీఎంట్రీ కలిసిరాలేదు. భారీ అంచనాలతో బరిలోకి దిగిన అతను, ఛత్తీస్‌గఢ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో దారుణంగా విఫలమయ్యాడు. పంజాబ్ తరఫున ఆడుతున్న గిల్, కేవలం ఒక్క పరుగు మాత్రమే చేసి పెవిలియన్‌కు చేరాడు. ఛత్తీస్‌గఢ్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అజయ్ మండల్ అద్భుతమైన బంతితో అతడిని క్లీన్ బౌల్డ్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు.



మొహాలీలోని కొత్త పీసీఏ స్టేడియంలో ఆదివారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టులో గిల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఇన్నింగ్స్ 27వ ఓవర్‌లో బౌలింగ్‌కు వచ్చిన అజయ్ మండల్.. తన మూడో బంతికే గిల్‌ను బోల్తా కొట్టించాడు. బంతి లైన్ ను అంచనా వేయడంలో పూర్తిగా విఫలమైన గిల్, దాన్ని అడ్డుకోలేకపోయాడు. బంతి నేరుగా బ్యాట్, ప్యాడ్ మధ్యలో నుంచి దూసుకెళ్లి మిడిల్ స్టంప్‌ను గిరాటేసింది. దీంతో కేవలం 5 బంతులు ఎదుర్కొని ఒక్క పరుగుకే గిల్ తన ఇన్నింగ్స్‌ను ముగించాడు.

భారత జట్టు త్వరలో న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనున్న విషయం తెలిసిందే. ఈ కీలక పర్యటనకు ముందు రెడ్ బాల్ క్రికెట్‌లో తగినంత ప్రాక్టీస్ పొందాలనే ఉద్దేశంతోనే గిల్ ఈ రంజీ మ్యాచ్‌లో ఆడేందుకు నిర్ణయించుకున్నాడు. సీజన్‌లోని తొలి మ్యాచ్‌కు దూరంగా ఉన్న అతను, ఈ మ్యాచ్ కోసం ప్రత్యేకంగా అందుబాటులోకి వచ్చాడు. కానీ, ఊహించని విధంగా విఫలం కావడం అభిమానులను నిరాశపరిచింది.

న్యూజిలాండ్ పర్యటనలో భారత జట్టు 5 వన్డేలు, 2 టెస్టులు ఆడనుంది. 2027 వన్డే ప్రపంచకప్‌కు సన్నాహకంగా, వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో నిలవడానికి ఈ సిరీస్ భారత్‌కు చాలా కీలకం. అయితే, గిల్ తొలి మూడు వన్డేల్లో మాత్రమే ఆడి, టెస్ట్ సిరీస్‌కు సంసిద్ధం కావడానికి చివరి రెండు వన్డేలకు దూరం కానున్నట్లు సమాచారం.

ఇదిలా ఉండగా, మరోవైపు సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ బెంగాల్ తరఫున సర్వీసెస్‌తో జరుగుతున్న మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో సోదరుడు మహమ్మద్ కైఫ్ జట్టులోకి వచ్చాడు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత భారత జట్టులో చోటు కోల్పోయిన షమీ, న్యూజిలాండ్ పర్యటనకు కూడా ఎంపిక కాలేదు. అయితే, దేశవాళీ క్రికెట్‌లో మాత్రం అతను నిలకడగా రాణిస్తున్నాడు.

# వైభవ్ విషయంలో గంభీర్.. ధోనీ విషయంలో గంగూలీ.. యాజమాన్యంలో ఎంత తేడా!

**వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీకి రాని ఆడే అవకాశం**
**అతను మరికొంత కాలం వేచి చూడాలని స్పష్టం చేసిన కోచ్ గంభీర్**
**ధోనీ విషయంలో గంగూలీ అనుసరించిన వైఖరికి ఇది పూర్తి భిన్నం**
**ప్రతిభ ఉన్న యువ ఆటగాళ్లకు వరుస అవకాశాలు ఇవ్వాలన్నది గంగూలీ సూత్రం**
**న్యూజిలాండ్ సిరీస్‌లోనైనా వైభవ్‌కు ఛాన్స్ వస్తుందా అనేది ఆసక్తికరం**

టీమిండియా యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి నిరీక్షణ తప్పడం లేదు. వెస్టిండీస్‌తో ఇటీవల ముగిసిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో జట్టుకు ఎంపికైనప్పటికీ, అతనికి ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడే అవకాశం రాలేదు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. వైభవ్ మరికొంత కాలం వేచి చూడాల్సిందేనని పరోక్షంగా సంకేతాలిచ్చారు. ఈ నిర్ణయం ఇప్పుడు భారత క్రికెట్ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ప్రస్తుతం జట్టులో స్థిరపడిన ఓపెనింగ్ జోడీ అభిషేక్ శర్మ, సంజూ శాంసన్‌లకే యాజమాన్యం ప్రాధాన్యత ఇచ్చింది. ఫామ్‌లో ఉన్నంత మాత్రాన తుది జట్టులో చోటు దక్కుతుందని భావించకూడదని, సీనియర్ ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం, భద్రతాభావం కల్పించడం ముఖ్యమని కోచ్ గంభీర్ గతంలోనే వైభవ్‌కు వివరించినట్లు తెలుస్తోంది. నిలకడగా రాణిస్తున్న ఆటగాళ్లకే తమ మొదటి ప్రాధాన్యత అని యాజమాన్యం స్పష్టం చేసింది.




ఈ పరిణామం మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ నాయకత్వ శైలిని గుర్తుకు తెస్తోంది. ముఖ్యంగా ఎంఎస్ ధోనీ విషయంలో గంగూలీ అనుసరించిన వైఖరికి, గంభీర్ వ్యూహానికి మధ్య ఉన్న తేడాపై విశ్లేషణలు మొదలయ్యాయి. ధోనీ తన అంతర్జాతీయ కెరీర్ ఆరంభంలో తొలి నాలుగు ఇన్నింగ్స్‌లలో విఫలమైనప్పటికీ, గంగూలీ అతనిపై నమ్మకం ఉంచి వరుస అవకాశాలు కల్పించాడు. ఆ నమ్మకాన్ని నిలబెడుతూ ధోనీ పాకిస్థాన్‌పై 148 పరుగుల కీలక ఇన్నింగ్స్‌తో చెలరేగి తన కెరీర్‌ను గొప్పగా మలుచుకున్నాడు.

ఒక ఆటగాడిని ఎంపిక చేశాక, వారిపై ఒత్తిడి తగ్గించి సహజంగా రాణించేందుకు కనీసం పది మ్యాచ్‌లైనా అవకాశాలు ఇవ్వాలన్నది గంగూలీ సిద్ధాంతం. ప్రతిభావంతులైన యువకులకు అండగా నిలబడితేనే వారు భవిష్యత్ స్టార్లుగా ఎదుగుతారని దాదా బలంగా నమ్మేవాడు. ఇప్పుడు టీమిండియా తదుపరి న్యూజిలాండ్‌లో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌లోనైనా వైభవ్ సూర్యవంశీకి యాజమాన్యం అవకాశం ఇస్తుందా? లేక గంభీర్ తన వ్యూహానికే కట్టుబడి ఉంటాడా? అనేది ఆసక్తికరంగా మారింది.

# అమెరికాలో భారత ఐఆర్ఎస్ అధికారిణి సంచలనం.. పవర్‌లిఫ్టింగ్‌లో 3 స్వర్ణాలు!

**ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో మూడు స్వర్ణాలు గెల్చిన ఏక్తా బిష్ణోయ్**
**ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా పవర్‌లిఫ్టర్‌గా రికార్డు**
**కోచ్ వీసా తిరస్కరణకు గురవడంతో వీడియో కాల్ ద్వారా సూచనలు**
**మొత్తం 362.5 కిలోల బరువు ఎత్తి జపాన్, కెనడా క్రీడాకారులపై విజయం**

ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) అధికారిణి ఏక్తా బిష్ణోయ్ క్రీడా ప్రపంచంలో చరిత్ర సృష్టించారు. అమెరికాలో జరిగిన వరల్డ్ మాస్టర్స్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఏకంగా మూడు స్వర్ణ పతకాలను కైవసం చేసుకుని దేశం గర్వపడేలా చేశారు. ఈ విజయంతో, మాస్టర్స్-2 విభాగంలో స్వర్ణం గెలిచిన తొలి భారత మహిళా పవర్‌లిఫ్టర్‌గా ఆమె రికార్డులకెక్కారు.

ఈ పోటీల్లో ఏక్తా బిష్ణోయ్ మొత్తం 362.5 కిలోల బరువును ఎత్తి, జపాన్, కెనడాకు చెందిన బలమైన ప్రత్యర్థులను అధిగమించారు. ఒకవైపు ఉన్నత ప్రభుత్వ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, కఠినమైన పవర్‌లిఫ్టింగ్ శిక్షణను కొనసాగించడం ఆమె అంకితభావానికి నిదర్శనం.




అయితే, ఈ విజయం అంత సులువుగా దక్కలేదు. టోర్నమెంట్‌కు ముందు భారత జట్టు కోచ్ సునీల్ కుమార్ యూఎస్ వీసా తిరస్కరణకు గురైంది. అయినా ఏమాత్రం వెనకడుగు వేయని ఏక్తా, వీడియో కాల్స్ ద్వారా కోచ్ సునీల్ నుంచి సూచనలు తీసుకున్నారు. టీమ్ అధికారి ఇబ్రహీం సహకారంతో వ్యూహాత్మకంగా ఆడి చారిత్రక విజయాన్ని అందుకున్నారు.

గెలుపు వ్యూహంపై కోచ్ సునీల్ కుమార్ మాట్లాడుతూ, “మా వ్యూహం చాలా స్పష్టంగా ఉంది. స్క్వాట్ ఈవెంట్ ముగిసేసరికే సమీప ప్రత్యర్థిపై 20 కిలోల ఆధిక్యాన్ని సాధించాం. బెంచ్ ప్రెస్‌లో ఆ ఆధిక్యాన్ని నిలబెట్టుకుని, చివరగా 150 కిలోల డెడ్‌లిఫ్ట్‌తో భారత్‌కు స్వర్ణ పతకాన్ని ఖాయం చేశాం” అని వివరించారు. ఏక్తా ఢిల్లీలోని నేతాజీ జిమ్‌లో కోచ్ సునీల్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నారు.

# పౌరసత్వమా, క్రికెట్టా?.. ఓసీఐ క్రికెటర్లు తేల్చుకోవాలి: బాంబే హైకోర్టు

**భారత్‌కు ఆడాలనుకుంటే పౌరసత్వం తీసుకోవాలని ఓసీఐ క్రికెటర్లకు బాంబే హైకోర్టు సూచన**
**బీసీసీఐ టోర్నీలలో ఆడేందుకు పాస్‌పోర్ట్ తప్పనిసరి చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్**
**దేశంలో ప్రతిభావంతులైన క్రికెటర్లకు కొదవలేదని వ్యాఖ్యానించిన ధర్మాసనం**
**పౌరసత్వ చట్టం ప్రకారం ఓసీఐ కార్డుదారులు అంతర్జాతీయంగా భారత్‌కు ఆడలేరన్న బీసీసీఐ**

విదేశీ పౌరసత్వం కలిగిన భారత సంతతి వ్యక్తులకు (ఓసీఐ) జారీ చేసే కార్డులున్న యువ క్రికెటర్లకు బాంబే హైకోర్టు కీలక సూచన చేసింది. భారత క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలనే బలమైన ఆకాంక్ష ఉంటే, ముందుగా భారత పౌరసత్వం తీసుకోవడంపై దృష్టి పెట్టాలని హితవు పలికింది.

బీసీసీఐ నిర్వహించే టోర్నమెంట్లలో పాల్గొనాలంటే భారత పాస్‌పోర్ట్ తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ 12 మంది ఓసీఐ కార్డు కలిగిన యువ క్రికెటర్లు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

కవిన్ కార్తీక్ అనే ఓసీఐ కార్డు హోల్డర్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి మహేశ్ చంద్ర త్రిపాఠి, జస్టిస్ అద్వైత్ సేథ్నాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది కునాల్ చీమా వాదనలు వినిపిస్తూ, ఈ యువ క్రీడాకారులు భారతదేశంలోనే నివసిస్తూ, ఇక్కడే చదువుకుంటున్నారని తెలిపారు.




కేవలం దేశవాళీ టోర్నమెంట్లలో ఆడేందుకు మాత్రమే అనుమతి కోరుతున్నారని, తద్వారా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో పాల్గొనేందుకు కూడా అర్హత సాధిస్తారని కోర్టుకు వివరించారు.

ఈ వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ.. “భారతదేశంలో ప్రతిభావంతులైన క్రికెటర్లకు కొరత లేదు. దేశానికి ప్రాతినిధ్యం వహించాలని మీకు అంతగా అనిపిస్తే, భారత పౌరసత్వం ఎందుకు తీసుకోకూడదు?” అని ప్రశ్నించింది.

ఓసీఐ హోదాను అట్టిపెట్టుకోవడమా లేక భారత పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకోవడమా అనేది వారే తేల్చుకోవాలని స్పష్టం చేసింది. అయితే, పౌరసత్వం మార్చుకోవాలని తాము బలవంతం చేయడం లేదని కూడా ధర్మాసనం స్పష్టత ఇచ్చింది.

బీసీసీఐ తరఫున సీనియర్ న్యాయవాది డాక్టర్ బీరేంద్ర సరాఫ్ వాదిస్తూ, పౌరసత్వ సవరణ చట్టం ప్రకారం ఓసీఐ కార్డుదారులు అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడానికి అనుమతి లేదని తెలిపారు. వారు క్రికెట్‌ను జీవనోపాధిగా పేర్కొనలేరని కూడా వాదించారు.

కాగా, 2023లో బీసీసీఐ ఈ కొత్త నిబంధనలను అమలు చేయడానికి ముందు వరకు ఓసీఐ కార్డుదారులు దేశవాళీ క్రికెట్‌లో పాల్గొనేవారని పిటిషనర్లు పేర్కొన్నారు.

# బౌలింగ్ మెరుగ్గా ఉంటే సిరీస్ గెలిచేవాళ్లం: శ్రేయస్ అయ్యర్

భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ 2-2తో సమంగా ముగిసింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా జరగాల్సిన నిర్ణయాత్మక ఐదో టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దీంతో ఇరు జట్లు ట్రోఫీని పంచుకున్నాయి. సిరీస్ ముగిసిన అనంతరం భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. తమ బౌలర్లు మరికొంత మెరుగ్గా బౌలింగ్ చేసి ఉంటే ఫలితం తమకు అనుకూలంగా ఉండేదని అభిప్రాయపడ్డాడు.

వర్షం కారణంగా చివరి మ్యాచ్‌ను 9 ఓవర్లకు కుదించగా, భారత్ 7.4 ఓవర్లలో 5 వికెట్లకు 118 పరుగులు చేసిన దశలో ఆటను నిలిపివేశారు. ఆ తర్వాత వర్షం ఆగకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. అనంతరం అయ్యర్ మాట్లాడుతూ “రెండో, నాలుగో మ్యాచ్‌లలో మా బౌలింగ్ మెరుగ్గా ఉండి ఉంటే సిరీస్ ఫలితం వేరేలా ఉండేది. అయితే వెస్టిండీస్ బ్యాటర్లకు క్రెడిట్ ఇవ్వాలి. ముఖ్యంగా షాయ్ హోప్ ఈ సిరీస్ అంతటా అద్భుతంగా ఆడాడు. ఓటమి తర్వాత కూడా మేం పుంజుకున్న తీరు మా దూకుడైన మనస్తత్వానికి నిదర్శనం” అని పేర్కొన్నాడు.

యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ గురించి మాట్లాడుతూ.. అవకాశాల కోసం ఓపికగా ఎదురుచూడాలని, తన ప్రక్రియను నమ్ముకుని నిలకడగా రాణించాలని సూచించినట్లు చెప్పాడు. భారత జట్టుకు ఇప్పటికే ఇద్దరు అద్భుతమైన ఓపెనర్లు ఉన్నారని అయ్యర్ గుర్తుచేశాడు.

మరోవైపు, ఈ సిరీస్‌లో రెండు సెంచరీలతో అదరగొట్టిన వెస్టిండీస్ ఆటగాడు షాయ్ హోప్ ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’గా నిలిచాడు. దాదాపు 20 ఏళ్ల తర్వాత భారత్‌లో సిరీస్ గెలిచే సువర్ణావకాశాన్ని త్రుటిలో చేజార్చుకున్నామని హోప్ ఆవేదన వ్యక్తం చేశాడు. అయినప్పటికీ, తమ జట్టు ఆటతీరులో ఎన్నో సానుకూల అంశాలు ఉన్నాయని, షమర్ స్ప్రింగర్, కీమో పాల్ వంటి ఆటగాళ్లు కీలక సమయాల్లో రాణించడం ఆనందాన్నిచ్చిందని తెలిపాడు. ఈ సిరీస్ ముగిసిన వెంటనే భారత జట్టు గురువారం నుంచి న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్ ఆడనుంది.

# మున్సిపల్ ఎన్నికలు: వైసీపీ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

**స్థానిక ఎన్నికల నామినేషన్ల గడువు విషయంలో వైసీపీకి చుక్కెదురు**
**గడువు ముగియడంతో పిటిషన్ నిరర్థకమని తేల్చిచెప్పిన న్యాయస్థానం**
**నామినేషన్ల తొలిరోజు హింసాత్మకం**
**అధికార పార్టీ నేతలు అడ్డుకుంటున్నారని వైసీపీ ఆరోపణలు**
**ఘర్షణల నేపథ్యంలో ఎంపీ మిథున్ రెడ్డి సహా 70 మందిపై కేసులు**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై నెలకొన్న రాజకీయ వేడి నేపథ్యంలో, వైసీపీకి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. నామినేషన్ల దాఖలుకు గడువును పొడిగించాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన హౌస్ మోషన్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది.

వివరాల్లోకి వెళితే, నామినేషన్ల స్వీకరణకు నిర్దేశించిన గడువు ఇప్పటికే ముగిసిపోయిందని, అందువల్ల ఈ పిటిషన్ విచారణకు అర్హత కోల్పోయిందని (నిరర్థకం) హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత తాము సాధారణంగా జోక్యం చేసుకోబోమని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. దీంతో నామినేషన్ల గడువు పొడిగింపు కోసం వైసీపీ చేసిన ప్రయత్నం విఫలమైంది.




మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల తొలి రోజైన శుక్రవారం పుంగనూరులో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణలు జరిగాయి. ఈ ఘటనలకు సంబంధించి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డితో పాటు సుమారు 70 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా, సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి పుంగనూరు పట్టణంలోకి ప్రవేశించకుండా పోలీసులు నోటీసులు కూడా జారీ చేశారు.ఈ పరిణామాలపై స్పందించిన ఎంపీ మిథున్ రెడ్డి, అధికార పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనక్కి తగ్గేది లేదని, అభ్యర్థుల హక్కుల కోసం న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# చల్లదనం కోసం ఎయిర్ పోర్టులోకి వస్తున్న పాములు.. ఆస్ట్రేలియాలో వింత పరిస్థితి!

**ఆస్ట్రేలియాలోని ఆలిస్ స్ప్రింగ్స్ ఎయిర్‌పోర్ట్‌లో పదుల సంఖ్యలో పాములు**
**ప్రయాణికుల లాంజ్, కార్యాలయాల్లోనూ విషపూరిత సర్పాల సంచారం**
**తీవ్రమైన ఎండల నుంచి తప్పించుకునేందుకే భవనాల్లోకి వస్తున్నాయని వెల్లడి**
**ప్రమాదకరమైన వెస్టర్న్ బ్రౌన్ స్నేక్స్ కూడా పట్టుబడిన వాటిలో ఉన్నాయి**
**ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని విమానాశ్రయ అధికారులు సూచన**

ఆస్ట్రేలియాలోని ఓ విమానాశ్రయంలో ఊహించని పరిణామం ప్రయాణికులను, సిబ్బందిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. సెంట్రల్ ఆస్ట్రేలియాలోని ఆలిస్ స్ప్రింగ్స్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ భవనంలోకి పదుల సంఖ్యలో విషపూరిత పాములు ప్రవేశిస్తున్నాయి. ప్రయాణికులు సేద తీరే క్వాంటాస్ లాంజ్, చెక్-ఇన్ ప్రాంతాలు, సిబ్బంది కార్యాలయాల్లోనూ ఇవి సంచరిస్తుండటంతో కలకలం రేగింది. వేసవి ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ సమస్య మరింత తీవ్రమైంది.



విషయం తెలుసుకున్న స్నేక్ క్యాచర్ రెక్స్ నీన్‌డార్ఫ్ బృందం వెంటనే రంగంలోకి దిగింది. ఎయిర్‌పోర్ట్‌లోని పలు ప్రాంతాల నుంచి ఇప్పటికే అనేక పాములను పట్టుకుని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పట్టుబడిన వాటిలో అత్యంత విషపూరితమైన వెస్టర్న్ బ్రౌన్ స్నేక్స్‌తో పాటు, తక్కువ ప్రమాదకరమైన విప్ స్నేక్స్ కూడా ఉన్నాయి. అయితే, ఇప్పటివరకు పాముల కారణంగా ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని అధికారులు తెలపడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

నార్తర్న్ టెరిటరీ ప్రాంతంలో విపరీతంగా పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఎండ వేడిమి నుంచి తప్పించుకునేందుకు, చల్లదనం కోసం పాములు భవనాల్లోకి ఆశ్రయం కోసం వస్తున్నాయని కన్జర్వేషన్ బయాలజిస్ట్ క్రిస్ జాలీ తెలిపారు. పాములు సహజ ఆవాసాలు, మానవ నిర్మిత కట్టడాల మధ్య తేడాను గుర్తించలేవని, చల్లగా ఉండే ప్రదేశం ఎక్కడ దొరికితే అక్కడికి వెళతాయని వివరించారు. పగటిపూట ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండటంతో, చల్లబడిన తర్వాత రాత్రి, సాయంత్రం వేళల్లో ఇవి ఎక్కువగా బయటకు వస్తున్నట్లు గుర్తించారు.

ఈ పరిణామంతో ఆలిస్ స్ప్రింగ్స్, డార్విన్, టెనెంట్ క్రీక్ విమానాశ్రయాలను నిర్వహించే ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ గ్రూప్ అప్రమత్తమైంది. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, నిపుణులైన స్నేక్ క్యాచర్ల సేవలను వినియోగించుకుంటోంది. సిబ్బందికి కూడా పాముల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. ఎక్కడైనా పాము కనిపిస్తే, సురక్షిత దూరం పాటించాలని, దాన్ని పట్టుకోవడానికి ప్రయత్నించవద్దని, వెంటనే నిపుణులకు సమాచారం ఇవ్వాలని స్థానిక అధికారులు ప్రయాణికులకు సూచిస్తున్నారు.

# శాంసంగ్ దీపావళి ధమాకా.. ఏఐ ఉపకరణాలపై అదిరిపోయే డీల్స్!

**శాంసంగ్ నుంచి దీపావళి 2026 పండుగ ఆఫర్ల ప్రకటన**
**బిస్పోక్ ఏఐ ఉపకరణాలపై రూ.20,000 వరకు క్యాష్‌బ్యాక్**
**జీరో డౌన్‌పేమెంట్, జీరో వడ్డీతో ప్రత్యేక 'ట్రిపుల్ జీరో ఆఫర్'**
**ఏఐ ఫుడ్ మేనేజర్ వంటి ఫీచర్లతో వస్తున్న కొత్త ఉత్పత్తులు**
**నవంబర్ 15 వరకు ఆఫర్లు అందుబాటులో**

ప్రముఖ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్, దీపావళి 2026 పండుగ సీజన్‌ను పురస్కరించుకుని తన 'బిస్పోక్ ఏఐ' గృహోపకరణాలపై ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించింది. ఈ ఆఫర్లలో భాగంగా వినియోగదారులకు భారీ క్యాష్‌బ్యాక్, సులభమైన ఈఎంఐ సదుపాయాలు కల్పిస్తోంది. ఈ ఆఫర్లు నవంబర్ 15 వరకు అందుబాటులో ఉంటాయి. శాంసంగ్ పలు మోడళ్ల రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు, వాక్యూమ్ క్లీనర్లు, ఓవెన్లు, డిష్ వాషర్లలో బిస్పోక్ ఏఐ ఫీచర్లను అందజేస్తోంది.



ప్రధాన ఆఫర్లు ఇవే..

ఎంపిక చేసిన బిస్పోక్ ఏఐ ఉపకరణాలపై గరిష్ఠంగా రూ.20,000 వరకు క్యాష్‌బ్యాక్ పొందవచ్చు. కేవలం రూ.888 ప్రారంభ ఈఎంఐతో ఉత్పత్తులను కొనుగోలు చేసే వెసులుబాటు కల్పించారు. దీనితో పాటు 'ట్రిపుల్ జీరో ఆఫర్' కూడా అందిస్తున్నారు. దీని కింద జీరో డౌన్‌పేమెంట్, జీరో ప్రాసెసింగ్ ఫీజు, 6 నుంచి 10 నెలల వరకు జీరో వడ్డీతో ఈఎంఐలు చెల్లించవచ్చు. శాంసంగ్ ఫైనాన్స్+ ద్వారా ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, టీవీఎస్ క్రెడిట్ వంటి సంస్థలతో కలిసి ఈ ఫైనాన్సింగ్ సదుపాయాలను అందిస్తున్నారు. అలాగే, శాంసంగ్ కేర్+ కింద అదనంగా 3 సంవత్సరాల వరకు వారంటీ పొందే అవకాశం కూడా ఉంది.

ఏఐ ఫీచర్లతో కొత్త అనుభూతి

శాంసంగ్ తన 2026 బిస్పోక్ ఏఐ ఉపకరణాలను 'నిజమైన ఇంటి నేస్తాలు' (ఠతీబవ ఎశీఎవ జశీఎజూఖఅఱశీఅ)గా అభివర్ణిస్తోంది. ఫ్యామిలీ హబ్ రిఫ్రిజిరేటర్‌లో జనరేటివ్ ఏఐ, ఏఐ ఫుడ్ మేనేజర్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ఈ టెక్నాలజీ ఫ్రిజ్‌లోని ఆహార పదార్థాలను గుర్తించి, వాటి నిల్వలను ట్రాక్ చేస్తుంది. స్మార్ట్‌థింగ్స్ ఫుడ్ యాప్ ద్వారా వంటకాలను సూచించడమే కాకుండా, గడువు ముగిసే పదార్థాల గురించి హెచ్చరిస్తుంది.

ఈ ఆఫర్లపై శాంసంగ్ ఇండియా డిజిటల్ అప్లయెన్సెస్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ గుఫ్రాన్ ఆలం మాట్లాడుతూ, "మా ఏఐ ఉపకరణాలు వినియోగదారుల రోజువారీ పనులను సులభతరం చేస్తాయి. ఈ దీపావళిని మరింత ప్రత్యేకం చేయాలనే ఉద్దేశంతో ఈ ఆఫర్లను అందిస్తున్నాం" అని తెలిపారు. శాంసంగ్ అధికారిక వెబ్‌సైట్, ప్రముఖ ఈ-కామర్స్ సైట్లు, దేశవ్యాప్తంగా ఉన్న రిటైల్ స్టోర్లలో ఈ ఆఫర్లను పొందవచ్చు.

# ప్రజాస్వామ్యంపై మీరు నీతులు చెప్పడమా?: జగన్‌కు అచ్చెన్నాయుడు కౌంటర్

**జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు విమర్శలు**
**2020 స్థానిక ఎన్నికల్లో జరిగిన దాడులకు జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్**
**నిమ్మగడ్డ రమేశ్ కుమార్ పదవీకాలం తగ్గింపు ఆర్డినెన్స్‌ను గుర్తు చేసిన మంత్రి**
**బెదిరింపుల వల్లే నాడు ఎన్నికలను బహిష్కరించాల్సి వచ్చిందని వెల్లడి**
**ఎన్నికల హింసపై నిష్పాక్షిక విచారణ జరిపిస్తామని హామీ**

ప్రజాస్వామ్యం గురించి నేడు మాట్లాడుతున్న జగన్, వారి హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల అరాచకాలకు ముందుగా సమాధానం చెప్పాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షాలపై జరిగిన దాడులను, ప్రజాస్వామ్య ఉల్లంఘనలను గుర్తు చేస్తూ జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.



"నేడు ప్రజాస్వామ్యం గురించి, రాజ్యాంగం గురించి మాట్లాడుతున్న జగన్ గారిని నేను ఒకటే సూటిగా ప్రశ్నిస్తున్నాను. 2020లో స్థానిక సంస్థల ఎన్నికల్లో మీరు, మీ ప్రభుత్వం చేసిన అరాచకాలకు ముందు సమాధానం చెప్పండి. ఆ తర్వాతే ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు మీకు ఉంటుంది.

ఆనాడు మాచర్లలో టీడీపీ నేతలు బోండా ఉమ, బుద్ధా వెంకన్నల వాహనంపై మీ పార్టీ శ్రేణులు దాడి చేసినప్పుడు మీకు ప్రజాస్వామ్యం గుర్తుకురాలేదా? పుంగనూరులో జనసేన అభ్యర్థి నామినేషన్ పత్రాలు చించివేసినప్పుడు రాజ్యాంగం ఏమైంది? మీ ఐదేళ్ల పాలనలో టీడీపీ, జనసేన అభ్యర్థులను నామినేషన్లు కూడా వేయకుండా అడ్డుకున్నారని వచ్చిన వేలాది ఫిర్యాదులకు మీ దగ్గర సమాధానం ఉందా? వీటన్నిటికీ జవాబు చెప్పకుండా ఈరోజు మీరు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉంది.

ఇప్పుడు ఎన్నికల సంఘం స్వతంత్రత గురించి మాట్లాడుతున్నారు కదా? మరి నాడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఉన్న నిమ్మగడ్డ రమేశ్ కుమార్ పదవీకాలాన్ని తగ్గిస్తూ ఆర్డినెన్స్ ఎందుకు తీసుకొచ్చారు? ఆ చర్యను హైకోర్టు తప్పుబడుతూ కొట్టివేసిన విషయం మర్చిపోయారా? మీ హయాంలో బెదిరింపులు, బలవంతపు ఉపసంహరణల ద్వారా ఏకగ్రీవాలు చేసుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఏమైందో చెప్పాలి.

మీ పార్టీ నాయకుల దాడులు, బెదిరింపులతో మా కార్యకర్తల ప్రాణాలు కాపాడుకోవడమే గగనమైంది. అందుకే, తప్పనిసరి పరిస్థితుల్లో మేము స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాల్సి వచ్చింది. ఈ విషయం మీరు మర్చిపోయినా, ప్రజలు మర్చిపోలేదు.

మిథున్‌రెడ్డి ఘటనతో సహా అన్ని ఎన్నికల హింసాత్మక ఘటనలపై నిష్పాక్షిక దర్యాప్తు జరగాలని మేము డిమాండ్ చేస్తున్నాం. తప్పు ఎవరు చేసినా చట్టం ముందు అందరూ సమానమే. చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాను" అని స్పష్టం చేశారు.

# జూబ్లీహిల్స్‌లోని 'ఫోర్ ఫాదర్స్' పబ్‌కు రూ.20 వేల జరిమానా.. కారణం ఇదే!

హైదరాబాద్ మహానగరంలో తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టే దిశగా జలమండలి కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రముఖ పబ్‌పై భారీ జరిమానా విధించడంతో పాటు, నీటి కనెక్షన్‌ను తొలగించి తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. నీటి వృథా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఈ చర్యల ద్వారా స్పష్టం చేసింది.

జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లో ఉన్న 'ఫోర్ ఫాదర్స్ పబ్' తాగునీటిని విపరీతంగా దుర్వినియోగం చేస్తున్నట్లు జలమండలికి ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన విజిలెన్స్ అధికారులు, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. పబ్‌లో నీటిని వృథా చేస్తున్నట్లు తనిఖీల్లో నిర్ధారణ కావడంతో, యాజమాన్యానికి రూ.20 వేల జరిమానా విధించారు.

అంతటితో ఆగకుండా, ఆ పబ్ తాగునీటి కనెక్షన్‌ను శాశ్వతంగా తొలగించారు. అంతేకాక, జలమండలి ఫిల్లింగ్ స్టేషన్ల నుంచి కమర్షియల్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను కూడా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

వేసవి దృష్ట్యా కఠిన చర్యలు.. ప్రజలకు విజ్ఞప్తి

వచ్చే ఏడాది వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకే ఈ కఠిన చర్యలు చేపట్టినట్లు జలమండలి స్పష్టం చేసింది. ప్రతి నీటి చుక్కనూ పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లు వంటి వాణిజ్య సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నీటి వృథాకు పాల్పడితే ఇలాంటి చర్యలే కొనసాగుతాయని హెచ్చరించింది.



నీటి సంరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని జలమండలి కోరింది. ఎక్కడైనా తాగునీటి దుర్వినియోగం జరుగుతున్నట్లు గమనిస్తే, ఫొటోలు లేదా వీడియోలతో సహా పూర్తి వివరాలను వాట్సాప్ నంబర్ 99499 30003కు పంపాలని సూచించింది. లేదా కస్టమర్ కేర్ నంబర్ 155313కు కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చింది.

# భజన పోటీల విజేత ఏడాకులపల్లి

## భక్తి గేయాలతో మైమరపించిన గాయనీ లలిత యశస్వి, ఉదయ భాస్కర్ రెడ్డి

**జహీరాబాద్, అక్టోబర్ 18 ప్రజాబలం ప్రతినిధి:** శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని భవాని మందిరంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి భజన పోటీలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆరు రోజులపాటు ఉత్సాహభరితంగా సాగిన ఈ పోటీల్లో జరాసంగం మండలం ఏడాకులపల్లి భజన మండలి విజేతగా నిలిచింది. ఇటికపల్లి భజన బృందం ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. శనివారం రాత్రి నిర్వహించిన తుది పోటీలు ఏడాకులపల్లి,










ఇటికపల్లి భజన బృందాల మధ్య హోరాహోరీగా సాగాయి. ఇరు బృందాలు భక్తి గీతాలను ఆలపిస్తూ ప్రేక్షకులను అలరించాయి. చివరికి ఏడాకులపల్లి బృందం ప్రథమ స్థానంలో నిలవగా, ఇటికపల్లి బృందం ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. సెమీఫైనల్ లో వెనదిరిగిన ఐదు భజన బృందాలకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. పోటీలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో భవాని మందిరం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.

భక్తి గేయాలతో ప్రత్యేక ఆకర్షణలి తుది పోటీలకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకులు ఉదయ భాస్కర్ రెడ్డి, ప్రముఖ గాయని లలిత యశస్వి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఆలపించిన భక్తి గేయాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. వారి గానానికి భక్తులు ముగ్ధులై ఆనందం వ్యక్తం చేశారు. భజన పాటలతో మందిర ప్రాంగణం మార్మోగింది. ఆధ్యాత్మికత, సంగీతం కలగలిసిన ఈ కార్యక్రమం ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని అందించింది.

ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకారంలి ఫైనల్ పోటీలకు స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు, మాజీ ఎంపీ బీబీ పాటిల్ హాజరై భజన బృందాలను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. భక్తిభావాన్ని పెంపొందించడంతోపాటు సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించడంలో భజన పోటీలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. భవాని మందిరంలో నిర్వహించిన భజన పోటీలు పట్టణ ప్రజల్లో భక్తిభావాన్ని మరింత పెంపొందించాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన భజన బృందాలు, కళాకారులు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, భజన మండళ్ల సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# పెండింగ్ సమస్యలను పరిష్కరించండి:ఎస్టీయూ....




స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్ .టి యు. ) ప్రత్యేక కార్యవర్గ సమావేశం నాగర్ కర్నూలు జిల్లా కేంద్ర భవనంలో జిల్లా అధ్యక్షులు కొత్త శ్రీధర్ రావు అధ్యక్షతన జరిగినది.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర పూర్వ అధ్యక్షులు,ఏఐఎస్టిఎఫ్ ఆడిటర్ అయిన ఎం పర్వత్ రెడ్డి హాజరై మాట్లాడినారు.ఎస్ టి యు ఏర్పడి 80 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా జిల్లాలో వైభవోత్సవాలను ఘనంగా నిర్వహించాలి అన్నారు.గతవారం లో జరిగిన 40 దేశాల ప్రతినిధులు హాజరైన ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సమ్మిట్ ఇండోనేషియా రాజధాని జకార్తాలో పాల్గొని వచ్చిన సందర్భంగా వారిని నాగర్ కర్నూల్ జిల్లా శాఖ ఘనంగా సన్మానించడం జరిగింది. నవంబర్ 14వ తేదీన 80 సంవత్సరాల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు కొత్త శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి యస్. మధుసూదన్ రెడ్డి ప్రకటించారు. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, పిఆర్సి రిపోర్టు తెప్పించాలని,హెల్త్ కార్డ్స్ పూర్తిస్థాయిలో అమలు చేయాలని, వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధులు కే.రమేష్, డి.ప్రభాకర్, కే.రఘురాం రెడ్డి,జిల్లా నాయకులు కర్ణాకర్ రెడ్డి, సత్యనారాయణ,బాలస్వామి,హనుమంత రెడ్డి, జమీల్ అహ్మద్,మురళి,ప్రవీణ్ కుమార్,నరసింహ, వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి హరి ప్రసాద్, మండల బాధ్యులు శివశంకర్,హుస్సేన్, నారాయణ,మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.




# భవాని మాత ఆలయానికి జహీరాబాద్ నుంచి పాదయాత్ర

**జహీరాబాద్ అక్టోబర్ 18 ప్రజా బలం ప్రతినిధి:** మొగుడంపల్లి మండలం ఖాన్ జమాల్‌పూర్ (భవానమ్మపల్లి)లోని తుల్జా భవాని మాత ఆలయానికి ఆదివారం జహీరాబాద్ నుంచి భక్తులు పాదయాత్రగా బయలుదేరారు. పట్టణంలోని భవాని మాత ఆలయం వద్ద ప్రముఖ వ్యాపారవేత్త కల్వ చంద్రశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హుగ్గెల్లి రాములు, యువజన కాంగ్రెస్ నాయకుడు నాగిరెడ్డి జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. పాదయాత్ర అధ్యక్షుడు కొండాపురం నర్సిములు మాట్లాడుతూ.. 12 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఈ యాత్ర 13వ సంవత్సరంలోకి అడుగుపెట్టిందన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ సుమారు 500 ఏళ్ల క్రితం ఈ ఆలయాన్ని నిర్మించినట్లు కథనాలు ఉన్నాయని తెలిపారు. మహారాష్ట్రలోని తుల్జాభవాని ఆలయానికి వెళ్లలేని భక్తులు ఇక్కడ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారని పేర్కొన్నారు.




భక్తుల సౌకర్యార్థం గోడిగార్‌పల్లి సర్పంచ్ యాదవరెడ్డి సత్వార్ చౌరస్తా వద్ద శిబిరం ఏర్పాటు చేసి పండ్లు, నీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పి.జి. శ్రీనివాస్, దేవరాజ్, శంకర్ సాగర్, నందీశ్వర్, మహారుద్రయ్య స్వామి, శ్రీనివాస్ రెడ్డి, వడ్ల వెంకట్, సత్యనారాయణరెడ్డి, నరేష్ పాటిల్, జగన్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి పూజ కార్యక్రమంలో పాల్గొన్న అంకిత సంస్థ

## జిల్లా కోఆర్డినేటర్ ప్రకాష్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 18 ( ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** అంకిత సంస్థ జిల్లా కోఆర్డినేటర్ అమ్మవారి పూజ కార్యక్రమంలో పాల్గొని ఘనంగా పూజలు నిర్వహించారు అమ్మవారు గ్రామాన్ని గ్రామ ప్రజలను జిల్లాను జిల్లా ప్రజలను ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో అమ్మవారి ఆశీర్వాదములు అందరిపై దయచేయా లని వికారాబాద్ జిల్లాఅంకిత సంస్థ కోఆర్డినేటర్ ప్రకాష్ తెలిపారు

# పేదలకు సీఎంఆర్ఎఫ్ అండ

**జహీరాబాద్, అక్టోబర్ 18 ప్రజాబలం ప్రతినిధి:** మొగుడంపల్లి మండలంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య చికిత్స పొందుతున్న తొమ్మిది మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.2.38 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పంపిణీ చేశారు. మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డితో కలిసి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సహాయ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంజు పవార్, రాములు, వెంకట్, కృపాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# పంచలింగాల్ బతుకమ్మ పండగసంబరాలు ఘనంగా నిర్వహించారు

**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 18 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పంచలింగాల్ గ్రామంలో అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా బతుకమ్మ పండుగ సంబరాలు జరుపుకోవడం జరిగిందని గ్రామ పెద్దలు తెలిపారు, బతుకమ్మ అందమైన తంగేడు పువ్వులు గునుక పూలు బంతిపూలు చేమంతి పూలు రంగురంగుల ప్రకృతి పూలతో గౌరీ దేవి బతుకమ్మ రూపంలో కోణాల ఆకారంలో అందంగా అమరుస్తారు






ఈ పూల పండుగ చాలా సంస్కృతికి ఆత్మ గౌరవానికి ప్రతీక బతుకమ్మ పండుగ భూమికి నీటికి మనుషులకు మధ్య అనుబంధాన్ని తెలియజేసేది తెలంగాణ బతుకమ్మ పండగ బతుకమ్మ పండగ సంబరాల్లో మహిళ సోదరులు అక్క చెల్లెలు కొత్త బట్టలు ధరించుకొని బతుకమ్మ పాటలు పాడుతూ చక్కగా చప్పట్లు కొడుతూ చక్కగా కోలాటాలు వేస్తూ అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా బతుకమ్మ పండుగ జరుపుకోవడం జరిగిందని గ్రామ పెద్దలు తెలిపారు బతుకమ్మ పండుగ సంబరాల్లో మర్పల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సురేష్ యాదవ్ మరియు గ్రామ మహిళా సోదరులు మహిళా సంఘాల అక్కచెల్లెళ్ల ఆడబిడ్డలు యువకిశోర బాలికలు అంగరంగ వైభవంగా కన్నుల పండుగ గా బతుకమ్మ పండుగ జరుపుకోవడం జరిగిందని తెలిపారు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు యువకులు యువజన సంఘాల నాయకులు గ్రామ ప్రజలందరూ కలిసి ఆటపాటలు ముగించుకొని పంచలింగాల్ గుండం చెరువులో బతుకమ్మలను వేయడం జరిగిందని తెలిపారు

# 44 కోట్లతో నాచారం రహదారికి మహర్దశ

## నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీ రఘురాం రెడ్డి

**ఖమ్మం జిల్లా బ్యూరో అక్టోబర్ 18:** 44 కోట్లతో నిర్మించే నాచారం రహదారి పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ..రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలు కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.



ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అత్యంత క్లిష్టమైన ఆర్థిక శాఖను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమర్థవంతంగా నిర్వహిస్తూ తెలంగాణ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు.

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు అందుతున్నాయని ఎంపీ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం లో..: కలెక్టర్ దివాకర.టిఎస్, సిపి సునీల్ దత్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మానవ కంటికి ఆకుపచ్చగా కనిపించే నక్షత్రం.. ఎలా సాధ్యం?

ఖగోళ శాస్త్రవేత్తలు ఓ అద్భుతమైన విషయాన్ని కనుగొన్నారు. మానవ కంటికి ఆకుపచ్చ రంగులో కనిపించే ఒక మరుగుజ్జు నక్షత్రాన్ని (ఔష్ట్రత్వ ఞఘుతీట) గుర్తించారు. వార్విక్ యూనివర్సిటీకి చెందిన మార్క్ హోలాండ్స్ నేతృత్వంలోని బృందం ఈ పరిశోధన చేసింది. విశ్వంలో సాధారణంగా నక్షత్రాలు నారింజ, తెలుపు లేదా నీలం రంగుల్లో కనిపిస్తుండగా, ఈ ఆకుపచ్చ నక్షత్రం అరుదైన ఆవిష్కరణగా నిలుస్తోంది.

సూర్యుడి వంటి నక్షత్రాలు తమ జీవితకాలం చివరి దశలో మరుగుజ్జు నక్షత్రాలుగా మారతాయి. ఇవి అత్యంత సాంద్రమైన నక్షత్ర అవశేషాలు. చాలా వరకు నక్షత్రాలు ఒకే తరహా రంగుల్లో కనిపిస్తాయి. అయితే కొన్ని మరుగుజ్జు నక్షత్రాల వాతావరణంలో ఉండే మూలకాల కారణంగా అవి విభిన్న రంగులను ప్రదర్శిస్తాయి. గ్రహశకలాలు లేదా గ్రహాల శకలాలు ఈ నక్షత్రాలపై పడినప్పుడు, వాటిలోని కాల్షియం, సోడియం, లిథియం, కార్బన్ వంటి మూలకాలు నక్షత్రం ఉపరితలంపైకి చేరతాయి. ఈ మూలకాలే వాటికి ప్రత్యేకమైన రంగులను ఆపాదిస్తాయి.

ఈ అధ్యయనంలో భాగంగా శాస్త్రవేత్తలు భూమికి 65 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న 151 మరుగుజ్జు నక్షత్రాలను పరిశీలించారు. వాటి వర్ణపటాలను (రాజూవష్తీఖు) విశ్లేషించి, అవి మానవ కంటికి ఏ రంగులో కనిపిస్తాయో లెక్కించారు.

# కొల్చారం మండలవ్యాప్తంగా అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

## సంప్రదాయ దుస్తుల్లో ఆడపడుచుల ఆటపాటలు.. పూల పండుగతో పల్లెల్లో సందడి

**కొల్చారం, అక్టోబర్ 18 (ప్రజాబలం) ప్రతినిధి:** కొల్చారం మండలవ్యాప్తంగా బతుకమ్మ పండుగ సంబరాలు అంబరాన్నంటాయి.

మండలంలోని వివిధ గ్రామాల్లో ఆడపడుచులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బతుకమ్మలకు నైవేద్యాలు సమర్పించి, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే ఆటపాటలతో సందడి చేశారు. కొంగోడు సర్పంచ్ దుబ్బ గళ్ళ స్వామి,నాయిని





జలాల్పూర్ గ్రామంలో సర్పంచ్ దేవి సింగ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలలో మహిళలు, యువతులు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. జానపద గీతాలు, మహిళల కోలాహలంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారులు సైతం బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ఆనందోత్సాహాలతో గడిపారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పూల సోయగాలు, మహిళల ఆటపాటలతో గ్రామాలన్నీ పండుగ శోభను సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు గంగ స్వామి దగ్గు దుర్గయ్య గొల్ల మధులత కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు



# ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమ్మెలో భాగంగా బతుకమ్మ అట

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 18 ఏటూరు నాగారం** ఏటూరు నాగారం మండల కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో ఎన్ హెచ్ ఎం మండల జేఏసీ కార్యదర్శి ఎం సుమలత మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారమే తెలంగాణ రాష్ట్రంలో 17వేల మంది ఉద్యోగులు సమ్మెను ఉధృతం చేశారు ఈ నెల 13 నుంచి 20 వరకు సమ్మె సమయాన్ని తెలియజేస్తూ సమ్మెలో పాల్గొంటూ వారి సమస్యలు ప్రభుత్వానికి తెలిసే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు దీనిలో భాగంగానే నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న మహిళ ఉద్యోగులు సద్దుల బతుకమ్మ నిరవధిక సమ్మె దగ్గరే జరుపుకుంటున్నారు ప్రభుత్వాలు మారిన ముఖ్యమంత్రి మారిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల బ్రతుకు మారలేదు అని ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మా సమస్యలను అర్థం చేసుకొని ఎన్ హెచ్ ఎం లో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ జీతాలు పెంచాలని ఉద్యోగ భద్రత కల్పించాలని హెల్త్ కార్డులు ఏర్పాటు చేయాలని మహిళలకు వేతనంతో కూడిన 180 రోజులు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి గారిని ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు కోరారు




# వినాయక నగర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**18 అక్టోబర్ 2026 హన్మకొండ (ప్రజాబలం ప్రతినిధి):** హన్మకొండా వినాయక నగర్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలను స్థానికులు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బతుకమ్మ పాటలు, ఆటపాటలతో వినాయక నగర్ పరిసరాల్లో పండుగ సందడి నెలకొంది.





ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆనందోత్సాహాల మధ్య వేడుకలను కొనసాగించారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. పండుగ సందర్భంగా స్థానికుల మధ్య ఐక్యత, సోదరభావం వెల్లివిరిశాయి. ప్రతి ఒక్కరూ కలిసి సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో వినాయక నగర్ గల్లీ పెద్దలు పాల్గొని వేడుకలను విజయవంతం చేయడంలో భాగస్వాములయ్యారు. అలాగే జర్నలిస్ట్ కలేరు శేఖర్ కార్యక్రమంలో పాల్గొని స్థానికులతో కలిసి సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మకు ఉన్న ప్రత్యేక స్థానాన్ని గుర్తుచేసుకున్నారు. వినాయక నగర్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరగడంతో స్థానికులంతా సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు ప్రజల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని స్థానికులు పేర్కొన్నారు.

## చండీ హోమం ం అన్నదానం కలిపి హైదర్‌నగర్ శ్రీ జయదుర్గా మైసమ్మ దేవస్థానంలో వైభవంగా శ్రీ చండీ హోమం జరిగింది:ఈవో సతీష్ బాబు





**హైదర్ నగర్ ( ప్రజాబలం ప్రతినిధి నరేష్ )అక్టోబర్ 18** హైదర్‌నగర్ గ్రామం, మెయిన్ రోడ్, కూకట్‌పల్లి మండలం, మేడ్చల్ జిల్లాలోని శ్రీ జయదుర్గా మైసమ్మ (స్వయంభువు) దేవస్థానంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శ్రీ చండీ హోమం వైభవంగా నిర్వహించబడింది. ఉదయం నుండి సాయంత్రం పూర్ణాహు తి వరకు వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయ అర్చకులు నవీన్ స్వామి,చందు స్వామి, ఋత్వికులు జ్ఞానేశ్వర్ శర్మ, ఆశ్రిత్ శర్మ, వినయ్ స్వామి,శ్రీకాంత్ స్వామి బృందంచే శాస్త్రోక్తంగాహోమం జరిపించారు. లోక కల్యాణం ,భక్తుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సకల దోష నివారణ కోసం ఈ హోమం నిర్వహించారుహోమగుండం చుట్టూ భక్తులు సంప్ర దాయ దుస్తులలో, కండువాలు ధరించి, అమ్మవారి నామస్మరణ చేస్తూ సంకల్పంతో పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ:

చండీ హోమం అనంతరం నిర్వహించిన అన్నప్రసాద (అన్నదాన) కార్యక్రమాన్ని శ్రీ మురళి సత్యదేవ్ వీణాదారి కుటుంబ సభ్యులు నిర్వహించారు.

భక్తజనులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని,అన్నప్ర సాదాన్ని స్వీకరించారని శ్రీ జయ దుర్గ మైసమ్మ దేవస్థానం కార్యనిర్వాహణాధి కారి సతీష్ బాబు మీడియా వారికి విడుదల చేశారు. శ్రీదేవి శరన్న వ రాత్రి మహోత్సవాలలో భాగంగా 8వ రోజు శ్రీ సింహ వాహిని శ్రీ దుర్గా దేవి స్వరూపం లో ఆశీర్వదిస్తున్న శ్రీ శ్రీ జయ దుర్గ మైసమ్మ తల్లి అమ్మవారు.నేడు భక్తులకు దర్శనమివ్వడం విశేషం.

## భక్తిశ్రద్ధలతో దేవీ నవరాత్రి ఉత్సవాలు - అమ్మవారిని దర్శించుకున్న ఆరెకపూడి గాంధీ

**శేర్లింగంపల్లి (ప్రజాబలం ప్రతినిధి నరేష్ )అక్టోబర్ 18** హైదర్‌నగర్ లోని శ్రీ జయదుర్గా మైసమ్మ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి.

దేవాలయ కమిటీ ఆహ్వానం మేరకు పీఏసీ చైర్మన్, శేర్లింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆదివారం ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు.

దేవస్థానకార్యనిర్వహణాధికారి సతీష్ బాబు ఆహ్వానం మేరకు స్థానిక నాయకులతో కలిసి ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ పురోహితులు ప్రత్యేక హారతులు ఇచ్చి సన్మానించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉదయం నుండి ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వందలాది మంది భక్తుల సమక్షంలో నిర్వహించిన చండీ హోమం కన్నుల పండుగగా సాగింది.

నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని



వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారని దేవస్థాన ఈవో సతీష్ బాబు పేర్కొన్నారు.

జయ అంటే విజయాన్ని కలిగించే మైసమ్మ తల్లిని మనసారా మొక్కిన వారి కోరికలు తీరుతాయని, ఏటేటా భక్తుల సంఖ్య పెరగడం హర్షణీయమని ఆయన అన్నారు. ఈ ఉత్సవాల నిర్వహణలో దేవస్థాన ఈవో సతీష్ బాబు, ఆలయ పురోహితులు నవీన్ కుమార్ స్వామి, చంద్రశేఖర్ స్వామి, లక్ష్మణ్, స్థానిక కాలనీవాసులు, యువకులు నిష్ఠగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతుల రాజేందర్, చాట్ల రవి, షేక్ హబీబ్, అష్రాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## రావులపల్లి బతుకమ్మ పండగసంబరాలు ఘనంగా నిర్వహించారు

### బతుకమ్మపండగ సంబరాలో పూర్తిగా సహకరించిన ముఖ్య అతిథులు గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి

**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 18 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం రావులపల్లి గ్రామంలో అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా బతుకమ్మ పండుగ సంబరాలు జరుపుకోవడం జరిగిందని గ్రామ పెద్దలు తెలిపారు, బతుకమ్మ అందమైన తంగేడు పువ్వులు గునుక పూలు బంతిపూలు చేమంతి పూలు రంగురంగుల ప్రకృతి పూలతో గౌరీ దేవి బతుకమ్మ రూపంలో కోణాల ఆకారంలో అందంగా అమరుస్తారు ఈ పూల పండుగ చాలా సంస్కృతికి ఆత్మ గౌరవానికి ప్రతీక బతుకమ్మ పండుగ భూమికి నీటికి మనుషులకు మధ్య అనుబంధాన్ని తెలియజేసేది తెలంగాణ బతుకమ్మ పండగ బతుకమ్మ పండగ సంబరాల్లో మహిళ సోదరులు అక్క చెల్లెలు కొత్త బట్టలు





ధరించుకొని బతుకమ్మ పాటలు పాడుతూ చక్కగా చప్పట్లు కొడుతూ చక్కగా కోలాటాలు వేస్తూ అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా బతుకమ్మ పండుగ జరుపుకోవడం జరిగిందని గ్రామ పెద్దలు తెలిపారు బతుకమ్మ పండుగ సంబరాల్లో గ్రామ మహిళా సోదరులు మహిళా సంఘాల అక్కచెల్లెళ్ల ఆడబిడ్డలు యువకిశోర బాలికలు అంగరంగ వైభవంగా కన్నుల పండుగ గా బతుకమ్మ పండుగ జరుపుకోవడం జరిగిందని తెలిపారు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు యువకులు యువజన సంఘాల నాయకులు గ్రామ ప్రజలందరూ కలిసి ఆటపాటలు ముగించుకొని రావులపల్లి చెరువులో బతుకమ్మలను వేయడం జరిగిందని మర్పల్లి మండల మాజీ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు రావులపల్లి గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి సంతోషంగా పండుగ సంబరాలు జరుపుకోవడం జరిగిందని తెలిపారు

## తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవప్రతీక బతుకమ్మ

### తెలంగాణ సంస్కృతికి వైభవం
### ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతిరూపం
### అందోల్ -జోగిపేట మున్సిపల్ వైస్ చేర్మన్ చిట్టిబాబు

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 18 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:**పూలలో ప్రకృతిని పూజించే అపురూప సంప్రదాయంమన బతుకమ్మమన తెలంగాణ బతుకమ్మ బతుకమ్మ అంటే కేవలం పూలను పేర్చి ఆడుకునే పండుగ మాత్రమే కాదు అది తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి మహిళల ఐక్యతకు,ప్రకృతి ప్రేమకు మన సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనశీ ప్రతి పువ్వులో ఒక అందం ప్రతి పాటలో ఒక భావం ప్రతి అడుగులో ఒక ఆనందం ప్రత బతుకమ్మలో తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయత దాగి ఉంటుంది తంగేడు పూల పసిడి అందాలు, గునుగు పూల రంగుల హరివిల్లు, బంతిపూల సోయగాలు, చామంతుల పరిమళాలు, గుమ్మడి పూల ప్రత్యేకత, రకరకాల అడవి పూల సహజ సౌందర్యంతో పేర్చిన బతుకమ్మ మన ప్రకృతి సంపదకు ప్రతిబింబం రంగురంగుల పూలను వరుసలుగా పేర్చి, మధ్యలో గౌరమ్మను ప్రతిష్ఠించి, చుట్టూ చేరి చప్పట్లు కొడుతూ పాటలు పాడుతూ, చేసే బతుకమ్మ సంబరాలు మన తెలంగాణ జీవన సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు బతుకమ్మ అంటే బతుకు మీదజఆశ బతుకమ్మ అంటే కుటుంబానికి ఆనందం బతుకమ్మ అంటే ఆడబిడ్డల ఆత్మీయఅనుబంధంబతుకమ్మ అంటే ప్రకృతికి కృతజ్ఞత బతుకమ్మ అంటే తెలంగాణ తల్లి ఒడిలోవికసించేపూల పండుగ,జై బతుకమ్మజైతెలంగాణ జైకాంగ్రెస్ జైకాంగ్రెస్ఆకులసత్యనారాయణ (శ్రీచిట్టిబాబు)వైస్. చైర్మన్. ఆందోల్ జోగిపేట,మున్సిపాలిటీ.....




## కత్తితో దాడి



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 18** ఏటూరు నాగారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని రామన్నగూడెంలో మద్యం మత్తులో ఇద్దరు కొట్టుకుంటున్నారని ఆపడానికి వెళ్లిన జి భాస్కర్ ను కత్తితో పొడిచి గాయపరిచారు దీనితో హుటాహుటిన ఏటూరు నాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు పరీక్షించిన వైద్యులు ఎలాంటి అపాయం లేదని చెప్పి సర్జరీ చేశారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆసుపత్రికి వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరిని అందులోకి తీసుకున్నారు

## అంబరాన్ని తాకిన బతుకమ్మ సంబరాలు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 18** ఏటూరు నాగారం సద్దుల బతుకమ్మ అంగరంగ వైభవంగా మహిళ మణుల సంతోషానికి హద్దులు లేకుండా పోయాయి ముఖ్యంగా యువత డ్యాన్సులతో డీజే పాటలతో బతుకమ్మ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది బతుకమ్మ సంబరాలను చూడడానికి తండూప తండలుగా ఏటూరు నాగారం నివాసులందరు ఆ ప్రాంతం వద్దకు చేరుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు

మహిళల చివరి రోజు బతుకమ్మను తనివి తీర తల్లిని సాగనంపడానికి చిన్న పెద్ద తేడా లేకుండా బతుకమ్మకు మళ్ళీ ఏడాది తిరిగి రావమ్మా అంటూ సంబరాలతో తల్లిని సాగనంపారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com